RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | మంగళవారం | పేజీలు : 6
సంపుటి : 3, సంచిక : 311 | నవంబర్ 18, 2025 | వెల : రూ.3-00



**మానవత్వాన్ని చాటుకున్న ఎమ్మెల్యే సత్యం**

3లో..

- ☐ 16 మంది హైదరాబాద్ వాసులు..!
- ☐ బదర్-మదీనా మధ్య యాక్సిడెంట్
- ☐ ప్రమాదంపై సీఎం రేవంత్ దిగ్భ్రాంతి



# 42 మంది సజీవదహనం..!?

**వేద న్యూస్, డెస్క్:**

మక్కా నుంచి మదీనాకు భారతీయ ప్రయాణికులతో వెళ్తున్న బస్సు బదర్-మదీనా మధ్య ముఫరహత్ ప్రాంతంలో ప్రమాదానికి గురైంది. డీజిల్ ట్యాంకర్‌ను బస్సు ఢీ కొంది.దీంతో అందులో ఉన్న ప్రయాణికులు 42 మంది సజీవదహనమైనట్లు తెలుస్తోంది. మృతుల్లో 20 మంది మహిళలు, 11 మంది చిన్నారులు ఉన్నారని సమాచారం. అర్ధరాత్రి సుమారుగా 2 గంటల సమయంలో ఈ యాక్సిడెంట్ జరిగినట్లు తెలుస్తున్నది. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. మృతుల్లో హైదరాబాద్ మల్లేపల్లి బజార్ ఘాట్ జీర్ర ప్రాంతానికి చెందిన 16 మంది ఉన్నట్టు సమాచారం. ఈ ప్రమాదానికి సంబంధించి పూర్తి డీటెయిల్స్ తెలుసుకోవాలని సీఎస్ డీజీపీని సీఎం రేవంత్ ఆదేశించారు. ప్రమాదంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు సాయం అందించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆఫీసర్లను ఆదేశించారు.

## నిరుపేదలకు అండగా మంత్రి



**కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న ఇర్ఫాన్‌కు తక్షణ వైద్యసాయం**
**"ఇర్ఫాన్ ఆరోగ్యం నా బాధ్యత" – కుటుంబానికి భరోసా**

**వేద న్యూస్, టేక్మాల్ :**

మెదక్ జిల్లా టేక్మాల్ మండలంలోని బొడ్మాట్ పల్లి గ్రామనికి చెందిన ఎండీ.ఇర్ఫాన్ గత కొన్నిరోజులుగా 2 కిడ్నీలు పాడు అయి సంబందిత వ్యాధులతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు శంకరప్ప, యువజన కాంగ్రెస్ అద్యక్షుడు మహేష్ రెడ్డి,గ్రామ నాయకులు, మంత్రి దామోదర రాజనర్సింహా దృష్టికి తీసుకెళ్లారు.తక్షణమే స్పందించిన మంత్రి ఉస్మానియా హాస్పిటల్ యజమాన్యం తో మాట్లాడి ఇంటికి అంబులెన్స్ పంపి ఈరోజు మెరుగైన చికిత్స కోసం ఉస్మానియా హాస్పటిల్ కి పంపడం జరిగింది.ఇర్ఫాన్ ఆరోగ్యం తన బాధ్యత అని కుటుంబ సభ్యులకు మంత్రి భరోసా ఇచ్చారు. గ్రామస్తులు మంత్రి కి ధన్యవాదాలు తెలిపి ఎల్లపుడు రుణపడి ఉంటామని తెలియజేశారు.

## బాధిత కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం

- మృతుల కుటుంబాలకు మంత్రివర్గం ప్రగాఢ సానుభూతి
- ప్రభుత్వ ప్రతినిధి బృందాన్ని సౌదీకి పంపాలని నిర్ణయం




**వేద న్యూస్, హైదరాబాద్ :**

సౌదీ ఆరేబియాలో మక్కా నుంచి మదీనాకు ప్రయాణిస్తున్న బస్సు ప్రమాదంలో మరణించిన తెలంగాణ రాష్ట్రానికి చెందిన యాత్రికులకుటుంబాలకు రూ. 5 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈరోజు మంత్రివర్గ సమావేశం ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపింది. ప్రమాదంపై మరిన్ని వివరాలు సేకరించడం, కుటుంబాలకు అవసరమైన సహాయాన్ని అందించడం కోసం మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ నేతృత్వంలో ప్రత్యేక ప్రభుత్వ బృందాన్ని సౌదీ అరేబియాకు పంపాలని కేబినెట్ నిర్ణయించింది. ఈ బృందంలో ఎంఐఎం ఎమ్మెల్యే ఒకరు, మైనారిటీ శాఖకు చెందిన ఒక అధికారి ఉంటారని వెల్లడించింది. మృతుల కుటుంబ సభ్యుల నిర్ణయం ప్రకారం, మత సంప్రదాయాలకు అనుగుణంగా సౌదీలోనే అంత్యక్రియలు జరపడానికి ప్రభుత్వం సహకరించనుంది. ఇందుకోసం ప్రతి బాధిత కుటుంబం నుంచి ఇద్దరు సభ్యులు సౌదీ అరేబియాకు వెళ్లే విధంగా అవసరమైన పాస్‌పోర్ట్, వీసా, ప్రయాణ ఏర్పాట్లను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఈ విపత్కర సమయంలో ప్రభుత్వమంతా బాధిత కుటుంబాల పక్కన నిలుస్తుందని, అవసరమైన అన్ని చర్యలు అత్యవసరంగా చేపట్టబడతాయని కేబినెట్ సమావేశం స్పష్టం చేసింది.



## భవిష్యత్తు బీజేపీదే..!

- ఉపఎన్నిక ఫలితాలపై ఈటల రాజేందర్ స్పందన
- డివిజన్ పాలిటిక్స్‌తో అధికారం సాధ్యం కాదని వ్యాఖ్య

**వేద న్యూస్, హైదరాబాద్ :**

ఉపఎన్నిక ఫలితాల నేపథ్యంలో బీజేపీ కార్యకర్తలకు ధైర్యం చెప్పిన పార్టీ సీనియర్ నేత, ఎంపీ ఈటల రాజేందర్, ఒక్క ఓటమి వచ్చినంత మాత్రాన కుంగిపోవాల్సిన అవసరం లేదని అన్నారు. ఉపఎన్నికల్లో అధికార పార్టీ గెలవడం సహజమని,

మిగతా 3వ పేజీలో..

## 'వేద న్యూస్' చొరవ

- ☐ వృద్ధురాలికి న్యాయం
- ☐ బాధితురాలిని వృద్ధాశ్రమంలో చేర్పించిన ఆఫీసర్
- ☐ 'వేద న్యూస్' తెలుగు దినపత్రికకు ప్రత్యేక అభినందనలు



**వేద న్యూస్, కమలాపూర్:**

'వేద న్యూస్' తెలుగు దినపత్రిక చొరవతో బాధితురాలికి న్యాయం జరిగింది. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం శనిగరం గ్రామానికి చెందిన గుండెకరి అంబక్క అనే వృద్ధురాలిని ఆమె సంతానం పట్టించుకోవడం లేదు. ఆమె ఆకలికి అలమటిస్తుండగా ఆ విషయాన్ని 'వేద న్యూస్' తెలుగు దినపత్రిక ఈ నెల 11న 'ఏడుగురిని కన్న తల్లికి ఏడుపే దిక్కా? 'అనే శీర్షికన కథనం ప్రచురించింది. బాధితురాలు తనకు న్యాయం చేయాలని కోరుతూ స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అయినా ఆ వృద్ధురాలి సమస్యకి పరిష్కారం లభించలేదు. వృద్ధురాలి కుమారులు, కుమార్తెల నుంచి ఎలాంటి స్పందన రాలేదు. దీంతో 'వేద న్యూస్' స్వయంగా వృద్ధురాలిని కలెక్టర్ ఆఫీస్ కి తీసుకెళ్లి.. అధికారుల దగ్గర వృద్ధురాలికి సంబంధించిన సమస్యను వివరించింది.

**– 'వేద న్యూస్'కు అభినందనలు**

వెంటనే స్పందించిన ఆర్డిఓ.. డిస్ట్రిక్ట్ వెల్ఫేర్ ఆఫీసర్‌కి వృద్ధురాలికి సంబంధించిన సమస్యను అప్పగించగా, డిస్ట్రిక్ట్ వెల్ఫేర్ ఆఫీసర్ జెట్టి జయంతి వృద్ధురాలి సమస్యను పూర్తిగా అర్థం చేసుకొని.. చలించిపోయి వ్యక్తిగతంగా సానుభూతి తెలియజేసి వృద్ధుల బాగోగులు బాగా చూసుకునే ఓ వృద్ధాశ్రమం నిర్వాహకులతో మాట్లాడి అప్పటికప్పుడే వృద్ధురాలికి వృద్ధాశ్రమంలో ఆశ్రయం కల్పించారు. వృద్ధురాలి సమస్య


వేద న్యూస్

2025-11-11
https://epaper.vedhanews.in/

ఏడుగురిని కన్న తల్లికి ఏడుపే దిక్కా?

- మాతృమూర్తి ఆకలి ఆర్తనాదాలు బిడ్డలకు వినిపిస్తలేవో?
- బుక్కెడు బువ్వకు భిక్కుభిక్కుమంటున్న గుండెకారి అంబక్క
- మాయమైపోతున్నారమ్మా..కడుపున పుట్టిన సంతానమూ
- వృద్ధురాలి సంరక్షణ మరిచిన బిడ్డలు..
- ఠాణా మెట్లెక్కిన తల్లి.. న్యాయం చేయాలని వేడుకోలు

వేద న్యూస్, కమలాపూర్:

బాగోగులు చూసుకోవాల్సిన కుమారులు పట్టించుకోకపోవడంతో ఆ తల్లి దీనంగా కాలం వెల్లదీస్తున్న దుస్థితి.. ఆ మాతృమూర్తికి ఏడుగురు సంతానం అందులో నలుగురు కుమారులు. పింఛను డబ్బులు తీసుకుని అయినా సరే.. తనకు బుక్కెడు బువ్వ పెట్టాలని తల్లి వేడుకున్నా కొడుకుల్లో ఎవరూ ముందుకు రావకపోవడంతో.. ఆమె పరిస్థితి దయనీయంగా మారింది. 'మాయమైపోతున్నడమ్మా మనిషన్న వాడు' అని అందెశ్రీ రాసిన మాటలను ఆ తల్లి పుత్రరత్నాలు అక్షరాలా నిజం చేస్తున్నారు. కని పెంచిన తల్లికి తిండి పెట్టకుండా..ఆమెను క్షోభ పెడుతున్నారు.

అనారోగ్యంతో వంట చేసుకోలేని స్థితి

వివరాల్లోకెళితే..హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం శనిగరం గ్రామానికి చెందిన గుండెకారి అంబక్క అనే వృద్ధురాలి దీనగాథ ఇది. ఆమెకు ఏడుగురు సంతానం. అందులో నలుగురు కుమారులు, ముగ్గురు కూతుర్లున్నారు. ఇంతమంది ఉన్నా ఆ తల్లికి బుక్కెడు బువ్వపెట్టేవారే కరువయ్యారు. ఆ తల్లి చిన్న కూతురు తన భర్త చనిపోయిన తర్వాత తన ఇద్దరు పిల్లలను తీసుకొని...పదేండ్ల క్రితం కమలాపూర్‌కి బ్రతుకుతెరువుకు వచ్చారు. అప్పుడు తన తల్లి అంబక్కను కూడా వెంటబెట్టుకుని..ఆనాటి నుంచి బాగోగులు చూసుకుంటూ వచ్చింది. భర్త కోల్పోయిన ఆమెకు తన ఇద్దరు పిల్లల్ని పోషించడం, చదివించుకోవడమే కష్టంగా మారినా.. ఇన్ని రోజులు ఏదో ఒకలా వెళ్లదీసుకొచ్చింది. ఆర్థిక కారణాలరీత్యా ఆమె కూడా బతుకుదెరువు కోసమని హన్మకొండకు వెళ్లింది. దాంతో వృద్ధురాలు అంబక్క ఎలాగోలా కొంతకాలంగా నెట్టుకొస్తున్నది. ఇటీవల కాలంలో ఆమెకు ఆరోగ్యం సహకరించక వంట కూడా చేసుకునే ఓపిక లేక గోస పడుతున్నది. వృద్ధురాలి పరిస్థితిని చూసి చలించిన మహిళా సంఘాల వీవోఏ పుల్ల బుజ్జమ్మ కొద్ది కాలం పాటు తన ఇంట్లో ఆశ్రయం కల్పించింది. కానీ, రోజురోజుకూ ఆ వృద్ధురాలి ఆరోగ్యం ఇబ్బందిగా మారుతుండడంతో ఆమెను చూసుకునే వారే లేకుండా పోయారు. ఈ నేపథ్యంలోనే వృద్ధురాలు న్యాయం కోసం పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కింది. పోలీసులు, అధికారులు తనకు న్యాయం చేయాలని, తన కుమారులను పిలిపించి తనకు బుక్కెడు బువ్వ పెట్టించేలా చూడాలని ఆ వృద్ధురాలు వేడుకుంటున్నారు.

పట్ల, స్పందించిన తీరు, పరిష్కరించిన విధానం, విధుల పట్ల తనకున్న నిబద్ధత పట్ల డిస్ట్రిక్ట్ వెల్ఫేర్ ఆఫీసర్ జయంతికి 'వేద న్యూస్' ధన్యవాదాలు తెలిపింది. కాగా, తమకు ధన్యవాదాలు వద్దనీ, ఈ విషయంలో ప్రత్యేకంగా చొరవ తీసుకొని ఇక్కడ దాకా వృద్ధురాలిని స్వయంగా తీసుకువచ్చి.. వృద్ధురాలి సమస్యకు పరిష్కారం లభించేలా సహకారం అందించిన 'వేద న్యూస్' కే తాను ధన్యవాదాలు తెలుపుతున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా తన సమస్యను కలెక్టర్ ఆఫీస్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి.. తన సమస్యకు పరిష్కార మార్గం చూపించి.. వృద్ధాశ్రమంలో చేర్పించి తన ఆకలి బాధను తీర్చినందుకు అంబక్క..'వేద న్యూస్' తెలుగు దినపత్రికకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కాగా, ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుంటూ.. అసలైన జర్నలిజానికి కేరాఫ్‌గా 'వేద న్యూస్' నిలుస్తున్నదని, సమస్యల పరిష్కారానికి పత్రికలు ఏ విధంగా కృషి చేస్తాయో..'వేద న్యూస్' ఆచరణలో తన వంతు పాత్రను నిర్వర్తిస్తోన్నదని 'పలువురు' ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు.

## రూ.74 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**వేద న్యూస్, మిర్యాలగూడ :**

నల్లగొండ జిల్లా మిర్యాలగూడ నియోజకవర్గంలో రూ.74 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన ఘనంగా జరిగింది. రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎంపీ రఘువీర్ రెడ్డి, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మా రెడ్డి, ఎంఎల్సీ శంకర్ నాయక్ కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. భారీ ర్యాలీలతో స్వాగతించిన కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలకు మంత్రులు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడిన నేతలు, నియోజకవర్గంలోని ప్రతి రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చే దిశగా పనులు ప్రారంభించామని తెలిపారు. ఈ ప్రాంత అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, నల్లగొండను మౌలిక సదుపాయాల పరంగా మరింత బలపరిచే కార్యక్రమాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వ కాలంలో కేఎన్ఎం డిగ్రీ

మిగతా 3వ పేజీలో..



వేద న్యూస్

మంగళవారం నవంబర్ 18, 2025

# నియామకం

**– కేటీఆర్ సేన వరంగల్ జిల్లా సోషల్ ఇన్‌చార్జిగా గోపాల కృష్ణ**



**వేద న్యూస్, వరంగల్:**

కేటీఆర్ సేన రాష్ట్ర అధ్యక్షుడు మెంగాని మనోహర్ ఆదేశాల మేరకు ఆ సేన వరంగల్ జిల్లా అధ్యక్షుడు మైనాల నరేష్.. జిల్లాకు సోషల్ మీడియా ఇన్‌చార్జ్‌గా గోపాలకృష్ణ గంగిసర్వ నియమించారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ సేన వరంగల్ జిల్లా అధ్యక్షుడు నరేష్ మాట్లాడుతూ.. కేటీఆర్ మార్గదర్శకత్వంలో కల్వకుంట్ల చంద్రశేఖర రావుని మళ్లీ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా చేయడం, ప్రస్తుత ప్రభుత్వ వైఫల్యాలను సోషల్ మీడియా వేదికగా ప్రజల ముందుకు తీసుకెళుతూ, తెలంగాణ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేయడమే లక్ష్యం అని చెప్పారు. గోపాలకృష్ణకి శుభాకాంక్షలు తెలిపారు.

# అర్జీలు సకాలంలో పరిష్కరించాలి

**- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్**



**వేద న్యూస్,రాజన్న సిరిసిల్ల:**

ప్రజావాణికి వచ్చే అర్జీలు సకాలంలో పరిష్కరించాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో ప్రజల నుంచి ఇంచార్జి కలెక్టర్ సోమవారం దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 149 దరఖాస్తులు వచ్చాయి. రెవెన్యూ 43, హౌసింగ్ శాఖకు 35, డీఆర్డీఏకు 12, ఎస్డీసీకి 11, విద్య శాఖ, సంక్షేమ అధికారికి 7చొప్పున, మున్సిపల్ కమిషనర్ సిరిసిల్ల, జిల్లా వైద్యాధికారి, ఉపాధి కల్పన కార్యాలయం, జిల్లా పంచాయతీ అధికారి, నీటి పారుదల శాఖకు నాలుగు చొప్పున, జిల్లా వ్యవసాయ అధికారి కి 3, లీడ్ బ్యాంక్ మేనేజర్, సెస్ కార్యాలయానికి రెండు చొప్పున, డీసీఎస్ఓ, మైనింగ్ శాఖ, మైనార్టీ సంక్షేమ అధికారి, ఈఈ పీఆర్, ఆర్ టీ సీ సిరిసిల్ల, ఎంపీడీఓ కోనరావుపేట, ఎస్పీ కార్యాలయానికి ఒకటి చొప్పున వచ్చాయి. అన్ని దరఖాస్తులు ఆన్లైన్లో పూర్తిగా పరిష్కరించాలని పెండింగ్ పెట్టవద్దని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు బాధ్యులు తప్పనిసరిగా ప్రజావాణికి హాజరు కావా లని స్పష్టం చేశారు. నూతన వైద్యశాలలు, అంగన్వాడిలు, పాఠశాలల భవనాలకు మిషన్ భగీరథ నీటి, విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని, ఆధార్ కార్డ్ తీసుకునేందుకు ఇబ్బంది పడుతున్న విద్యాలయాల విద్యార్థులకు త్వరితగతిన బర్త్ సర్టిఫికెట్ జారీ చేయాలని రెవెన్యూ, మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, సిరిసిల్ల వేములవాడ ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాభాయ్, డీఆర్డీఓ శేషాద్రి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత తదితరులు పాల్గొన్నారు.

# సీనియర్ సిటిజన్ల నిర్వహణ సంక్షేమ చట్టంపై అవగాహన

**వేద న్యూస్,తంగళ్లపల్లి :**




తల్లిదండ్రులు సీనియర్ సిటిజన్ల నిర్వహణ మరియు సంక్షేమ చట్టం, 2007 పైన అవగాహన సదస్సును ఏర్పాటు చేయడం జరిగిందని చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ టి. పర్శరాములు తెలిపారు. సోమవారం తంగళ్లపల్లి మండలంలోని మండేపల్లి గ్రామంలో ప్రభుత్వ వయోవృద్ధుల ఆశ్రమంలో న్యాయ విజ్ఞాన సదస్సును ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా న్యాయ సేవాధికర సంస్థ అధ్యక్షురాలు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.పుష్పలత ఆదేశాలతో సీనియర్ సివిల్ జడ్జి కార్యదర్శి, డి ఎల్ ఎస్ ఏ. పి.లక్ష్మణాచారి డి ఎల్ ఎస్ ఏ సమన్వయంతో ఈ సదస్సును ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. భారతదేశంలోని తల్లిదండ్రులు వృద్ధాప్య సిటిజన్ల హక్కులను రక్షించడానికి ఈ చట్టం రూపొందించబడిందని అన్నారు. అనంతరం వృద్ధాశ్రమంలోని వృద్ధులకు పండ్లు, బిస్కెట్లు అందచేయడం జరిగింది. ఈ సదస్సులో లోక్ అదాలత్ సభ్యులు న్యాయవాదులు ఆడెపు వేణు, గుర్రం ఆంజనేయులు. వృద్ధాశ్రమ కో ఆర్డినేటర్ మమత, సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా సామూహిక శ్రీ సత్యనారాయణ వ్రతం

**– కార్తీక మాసం సందర్బంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు**



మెదక్ జిల్లా టేక్మాల్ మండల కేంద్రంలోని శ్రీ రాజరాజేశ్వరి ఆలయంలో సోమవారం ఘనంగా సామూహిక సత్య నారాయణ వ్రతాన్ని పూజారి నూతి శ్రీనివాస్ ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేవారు ఆలయ ఆవరణలో సాంప్రదాయ దు స్తులతో హాజరయ్యారు. వ్రతంలో భాగంగా గణపతి పూజ, కలశస్థాపన, వ్రత కథా ప్రవ చనం, భజన కార్యక్రమాలు కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమం గ్రామానికి చెందిన నాగులపల్లి వంశస్తుల ఆధ్వర్యంలో జరిపించారు. ఈ వ్రతంలో సుమారు 30 మంది దం పతులు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం నాగులపల్లి మమత, నారాయణలు భక్తులకు తీర్థ ప్రసాదాలను అందచేసి, వచ్చిన భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు.

# కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలం

**– భవన నిర్మాణ కార్మిక సంఘాల జేఏసీ**




**వేద న్యూస్,కరీంనగర్:**

జిల్లాలో పెండింగ్ లో ఉన్న భవన నిర్మాణ కార్మికుల సమస్యలు, జాయింట్ యాక్షన్ కమిటీ జేఏసీ డిమాండ్స్ ను వెంటనే పరిష్కరించాలని సోమవారం రోజున జిల్లా అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్స్ ( ఏఎల్ఓ) రఫీఅహ్మద్, చక్రధర్ రెడ్డిలకు జేఏసీ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘం ( ఏఐటియుసి)రాష్ట్ర ఉపాధ్యక్షులు పిట్టల సమ్మయ్య మాట్లాడుతూ సంక్షేమ బోర్డు స్కీములను ప్రవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇచ్చిన అనుమతిని సంహరించుకొని సిఎస్సి హెల్త్ టెస్టులను రద్దు చేయాలన్నారు. సహజ మరణానికి ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని రెన్యువల్ కానీ 13 లక్షల వెల్ఫేర్ బోర్డు కార్డులు వెంటనే రెన్యువల్ చేయాలని పెండింగ్ క్లేమ్సును నిధులు విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. లేబర్ ఆఫీసులో గుర్తింపు సంఘాలను అనుమతిస్తూ ప్రవేట్ సంఘాల పేరుతో వస్తున్న వారిని అరికట్టాలని వెల్ఫేర్ బోర్డులో గుర్తింపు సంఘాల సభ్యులతో అడ్వైజర్ కమిటీ ద్వారా నిధులను మంజూరు చేసి కార్మికులను ఆదుకోవాలని కోరారు. మీసేవ కేంద్రాలలో నిబంధనల విరుద్ధంగా అధిక డబ్బులు వసూలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుని లేబర్ కార్డు ఆధార్ కార్డులలో పేర్లలో అక్షరాలు తేడా ఉంటే క్లేన్ కావడం లేదని వాటిని సరిచేసి క్లైంట్స్ ఇప్పించాలని ఇంకా అనేక రకాల కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కరించాలని వారు అధికారులను కోరారు. ఈ వినతిపత్ర సమర్పణ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘాల జేఏసీ నాయకులు కటిక రెడ్డి బుచ్చన్న యాదవ్, పిట్టల సమ్మయ్య,ఆకుల మల్లేష్, బొంకూరి రాములు, ఓజిందం ప్రసాద్,రేగుల కుమార్, జి కొమురయ్య, కసిబోసుల సంతోషచారి, పిట్టల శ్రీనివాస్, సదానందం, నూనె సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిజ్ఞ దివస్ గోడపత్రిక ఆవిష్కరణ

**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**



స్వేరోస్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఈనెల 23వ తేదీన జన్మదిన సందర్భంగా ప్రతిజ్ఞ దివస్ పేరుమీద ఈ వారం రోజులపాటు వివిధ మాధ్యమంలో అనేక కార్యక్రమాలు జరుపుటకు సిద్ధమైన సందర్భంగా సోమవారం నాడు కేయూ గెస్ట్ హౌస్ వద్ద గోడపత్రిక ఆవిష్కరించడం జరిగింది. సేవా దినోత్సవం, జ్ఞాన జ్యోతి దినోత్సవం, ప్రేరణ దినోత్సవం ,స్వేరోవిందు, పర్యావరణ దినోత్సవం, నాయకత్వ దినోత్సవం, ప్రతిజ్ఞ దినోత్సవం ఈ యొక్క మాధ్యమంలో ప్రతిజ్ఞ దివస్ చేయడం జరుగుతోంది. ఈ కార్యక్రమంలో స్వేరోస్ తెలంగాణ రాష్ట్ర చీఫ్ కన్వీనర్ బల్గూరి దుర్గయ్య, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు వీరయ్య , ఎస్ఆర్పీలు, స్వేరోస్ రాష్ట్ర నాయకులు, స్వేరోస్ జిల్లా నాయకులు, స్వేరో స్టూడెంట్స్ యూనియన్ విద్యార్థి విభాగం తదితరులు పాల్గొన్నారు.

# పల్లెల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి



**వేద న్యూస్, చొప్పదండి :**

చొప్పదండి నియోజకవర్గంలోని ప్రతిపల్లెను అభివృద్ధి చేయడానికి ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. మండలంలోని గట్టుభూత్కూర్లో రూ.20 లక్షలు, గంగాధరలో రూ.20 లక్షలతో నిర్మిస్తున్న ఆరోగ్య ఉప కేంద్రాల భవన నిర్మాణానికి, వెంకంపల్లి లో రూ.20 లక్షలతో నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి, రూ.5 లక్షలతో ప్రెస్ క్లబ్ నిర్మాణా పనులకు శంకుస్థాపన చేశారు. గంగాధరలో రూ. 44 లక్షలతో , మధురానగర్ లో రూ.11 లక్షలుతో నిర్మించిన సీసీ రోడ్లను, రూ.11 లక్షలతో మండల కేంద్రంలోని ఎస్సీ బాయ్స్ హాస్టల్ మరమ్మత్తు పనులను, మండల కేంద్రంలో రూ.5 లక్షలతో నిర్మించిన సబ్ డివిజన్ కాంపౌండ్ వాల్, రూ.5 లక్షలతో నిర్మించిన బతుకమ్మ ఘాట్,రూ.5 లక్షలతో అంబేద్కర్ సంఘ భవనంలో వేసిన సీసీ ప్లాట్ ఫామ్ ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని పల్లెల అభివృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. చొప్పదండి నియోజకవర్గం లోని ప్రతి పల్లెను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, రాష్ట్రానికి రోల్ మోడల్ గా తీర్చిదిద్దుతామన్నారు. చొప్పదండి నియోజకవర్గం లో ఇప్పటికే ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మంజూరు చేయించినట్లు తెలిపారు. నారాయణపూర్ రిజర్వాయర్ కింద ముంపునకు గురవుతున్న భూములు ఇండ్లకు సంబంధించి నిర్వాసితులకు రూ.23.50 కోట్లు మంజూరు చేయించినట్లు తెలిపారు. చొప్పదండి నియోజకవర్గం ప్రజలు తనపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయనని, రానున్న రోజుల్లో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలో నిలుపుతామన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వ సంక్షేమ ప్రజల్లో ప్రచారం చేయాలని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించే దిశగా పనిచేయాలని సూచించారు. పార్టీ కోసం పనిచేసిన ప్రతి కార్యకర్తకు గుర్తింపునిచ్చి కాపాడుకుంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో గంగాధర మార్కెట్ కమిటీ చైర్మన్ జాగిరపు రజిత శ్రీనివాస్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ వెలిచాల తీర్మల్ రావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తోట కరుణాకర్, సింగిల్ విండో వైస్ చైర్మన్ వేముల భాస్కర్, ఎంపీడీవో రామ్, మండల అధ్యక్షుడు పురుమల్ల మనోహర్, బుచ్చన్న, రామిడి రాజిరెడ్డి, పడాల రాజన్న, తాళ్ళ శ్రీనివాస్, గంగాధర ప్రవీణ్, తాళ్ళ సురేష్, బుర్గు గంగన్న, రాజగోపాల్ రెడ్డి, దోర్నాల శ్రీనివాస్ రెడ్డి, సత్తు కనుకయ్య, పడితపల్లి కిషన్, తోట సంధ్య, వేముల అంజి, రోమాల రమేష్, బాపు రెడ్డి, మేర్గ కొండయ్య, స్వామి, గరిగంటి కరుణాకర్,దికొండ మధు , సతీష్, మహేష్, శంకరయ్య, చందు, నగేష్, కొల ప్రభాకర్, మ్యాక వినోద్, మహేష్, గంగివేణి నవిన్, మంత్రి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళల రక్షణే షీ టీమ్స్ ప్రధాన లక్ష్యం

**వేద న్యూస్,ఇల్లంతకుంట:**



రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని రేపాక సోమవారం పేట వెంకట్రావుపల్లె అనంతగిరి గ్రామాలలోని విద్యార్థులకు సి టీం బృందం అవగాహన కల్పించారు మహిళలు, యువతులు,బాలికలు ఆకతాయిల వలన గానీ,మరే విధమైన వేధింపుల వలన గానీ ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లయితే నిర్భయంగా షీటీమ్స్ ని సంప్రదించవచ్చని తెలిపారు. జిల్లాలో విద్యార్థినులు,మహిళలు అన్యాయానికి గురైనప్పుడు భయపడొద్దని, ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తే నిందితులపై ఖచ్చితంగా చర్యలు తీసుకుంటామన్నారు .కళాశాల, పాఠశాలల విద్యార్థినులు ర్యాగింగ్,ఈవ్ టీజింగ్ లకు గురైనా, మహిళలు పని చేసే ప్రదేశాల వద్ద వేధిం పులకు గురైనా,బాలికలపై ఎవరైనా లైంగిక వేధింపులకు పాల్పడినా వెంటనే నిర్భయంగా షీ టీమ్ పోలీసులకు తెలుపాలి మహిళలు సామాజిక మాధ్యమాలైన ఫేస్బుక్, వాట్సాప్, ఇన్స్టాగ్రామ్ వినియోగంలో జాగ్రత్తలు వహించాలని,వాటిలో ఫొటోలు, వీడియోలు పోస్టు చేసే సమయంలో వ్యక్తిగత భద్రతకు సంబంధించి అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నేరుగా 8712656425 ఫోన్ నంబరుకు లేదా డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం అందించాలని వారి వివరాలను గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు. షీ టీం సభ్యులు ఏఎస్ఐలు వీరయ్య ప్రమీల కానిస్టేబుల్ శ్రీనివాస్ ప్రియాంకలు వివిధ పాఠశాలలోని ఉపాధ్యా యులు విద్యార్థులు పాల్గొన్నారు.

## మానవత్వాన్ని చాటుకున్న ఎమ్మెల్యే సత్యం

**వేద న్యూస్, చొప్పదండి గంగాధర :**



గంగాధర మండలం కురిక్యాల గ్రామానికి చెందిన భీమనాతిని సత్యవ్వ అనే మహిళ రోడ్డు ప్రమా దంలో తీవ్రంగా గాయ పడింది. గంగాధర మండలంలో వివిధ అభి, వృద్ధి పనుల ప్రారంభోత్సవం కోసం అటుగా వెళుతున్న చొప్ప దండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రమా దాన్ని గమనించి తన వాప నాన్ని ఆపారు. గాయపడిన మహిళను దగ్గరుండి స్థానిక పోలీస్ వాహనంలో కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. కరీంనగర్ లోని ఆసుపత్రి వైద్యులతో ఫోనులో మాట్లాడి గాయపడిన మహిళకు మెరుగైన వైద్యం అందజేయాలని ఆదేశించారు. ప్రమాదంలో గాయపడిన మహిళను స్వయంగా ఆసుపత్రికి తరలించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ను మండల ప్రజలు అభినందించారు.

## సాంకేతికను సద్వినియోగం చేసుకోండి

**వేద న్యూస్, చొప్పదండి రామడుగు :**



నేటి ఉరుకుల పరుగుల జీవితంలో మన మొబైల్ ఎక్క డో ఓ చోట పడి పోయినప్పుడు స్థానిక పోలీస్ స్టేషన్లో పి ర్యాదు చేయాలని ఎస్ఐ రాజు విజ్ఞప్తి చేశారు. వెదిర ఎక్స్ రోడ్డులో మొబైల్ పోగొట్టుకున్న చొప్పదండి గ్రామా నికి చెందిన తాల్లపల్లి ప్రశాంత్ కు ఎస్ఐ సోమవారం అప్పగించారు. ఈ సంద ర్భంగా ఆయన మాటాడుతూ అందు బాటులోకి వచ్చిన సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్ లొకే షన్ కని పెట్టే పరి జ్ఞానం ప్రజలు ఉపయోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ఫ్రీ హెల్త్ క్యాంపునకు విశేష స్పందన

### - ఎల్కతుర్తిలో వైద్య శిబిరాన్ని ప్రారంభించిన కలెక్టర్ స్నేహ శబరీష్





**వేద న్యూస్, ఎల్కతుర్తి:**


రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. వరంగల్ కాకతీయ వైద్య కళాశాల, హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్య శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఎల్కతుర్తి మండల ప్రజల కోసం ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఎల్కతుర్తి గ్రామ పంచాయతీ, ఎంపీడీవో కార్యాలయాల ప్రాంగ ణంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ప్రారంబించారు. ఈ క్యాంపునకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది .మెగా వైద్య శిబిరంలో ఓపి నమోదు, హెల్ప్ డెస్క్, ల్యాబ్, ప్రాథమిక పరీక్షల కౌంటర్లను కలెక్టర్ పరిశీలించారు. జనరల్ ఫిజీషియన్ విభాగాలతో పాటు ఎముకలు, శస్త్ర చికిత్స, పిల్లలు, చెవి ముక్కు గొంతు, చర్మవ్యాధి, ఛాతీ, కంటి, స్త్రీ వైద్య నిపుణులు వైద్య సేవలను అందిస్తుండగా కలెక్టర్ సందర్శించి.. ఆయా విభాగాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఫార్మసీ కౌంటర్ ను కలెక్టర్ సందర్శించారు. ఈ సంద ర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన వైద్య సేవలను అందించాలని వైద్యులకు సూచించారు. కాకతీయ వైద్య కళాశాలకు చెందిన పది విభాగాలు, ఎంజీఎం ఆసుపత్రి నుండి స్పెషలిస్ట్ వైద్యులు ఉచిత మెగా వైద్య శిబిరంలో పాల్గొని ప్రజలకు వైద్య సేవలు అందించారు. ఎల్కతుర్తి, గోపాలపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని ఏఎన్ఎంలు, ఆశాలు , మహిళా సమాఖ్య సభ్యులు , గ్రామ కార్యదర్శులు సంబంధిత గ్రామ ప్రజలను గుర్తించి శిబిరానికి పంపించగా వివిధ విభాగాల వైద్యులు పరీక్షించారు. ఈ శిబిరంలో కాకతీయ వైద్య కళాశాల ,ఎంజీఎం ఆసుపత్రి నుండి 38 మంది స్పెషలిస్ట్ వైద్యులు, 60 మంది పీజీ విద్యార్థులు , ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్టులు, పారామెడికల్ సిబ్బంది పాల్గొనగా, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ తరపున 35 మంది డాక్టర్లు ,సూపర్వైజర్లు , ల్యాబ్ టెక్నీషియన్లు , ఏఎన్ఎంలు,ఆశా కార్యకర్తల బృందం పాల్గొన్నారు. అలాగే ప్రజలకు వివిధ ఆరోగ్య అంశాల పట్ల, ప్రభుత్వం చేపడుతున్న ఆరోగ్య కార్యక్రమాలకు సంబంధించిన అవగాహన ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ప్రతి ఒక్కరికి బీపీ తో పాటు అవసరమైన వారికి షుగర్ , హిమోగ్లోబిన్ పరీక్షలను అక్కడే నిర్వహించగా ఇతర ల్యాబ్ పరీక్షలకు నమూనాలు సేకరించి తెలంగాణ డయాగ్నొస్టిక్ హబ్ లో పరీక్షల నిమిత్తం పంపించారు.

**హెల్త్ క్యాంపును సద్వినియోగం చేసుకున్న జనం**

ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని, స్థానికంగా అందుతున్న వైద్యంతో పాటు, స్పెషలిస్ట్ వైద్య సేవలు అవసరం ఉండి .. పనుల ఒత్తిడి వల్ల అలాగే వైద్య పరీక్షలకుటెస్టులకు అదనంగా డబ్బులు వెచ్చించలేక పట్టణాలకు వెళ్లలేక పోతున్న వారి కోసం మండల కేంద్రంలో వారికి అందుబాటులో వైద్య సేవలు అందించాలని ఉద్దేశ్యంతో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. క్యాంపును జనం సద్వినియోగం చేసుకున్నారు. 93 మందికి ఒక్కరికి దాదాపుగా రూ.1800 చొప్పున రూ. 1,67,000 వేల విలువైన ల్యాబ్ పరీక్షలు,122 మందికి రూ.16000 విలువైన రాండమ్ బ్లడ్ షుగర్ పరీక్షలు, రూ.2 లక్షల పైగా విలువచేసే మందులను పంపిణీ చేశారు. డి ఎం హెచ్ ఓ గారి విజ్ఞప్తి మేరకు వరంగల్ జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అసోసియేషన్ వారు దాదాపుగా రూ.15 వేల విలువైన మందులు అందజేశారు. మొత్తం వైద్య శిబిరంలో 762 మంది వైద్య సేవలు అందుకున్నారు. కార్యక్రమంలో కేఎంసి ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్య, ఎంజీఎం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరిశ్చంద్రారెడ్డి, డిఎంహెచ్వో డాక్టర్ అప్పయ్య, కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి, స్థానిక తహసీల్దార్ ప్రసాద్ రావు,ఎంపీడీవో విజయ్ కుమార్, ఏఎంసీ చైర్మన్ సంతాజీ, సీఐ రమేష్, ఇతర అధికారులు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## దయచేసి నన్ను కాపాడండి

**వేద న్యూస్,ఇల్లంతకుంట:**



రాజన్న సిరిసిల్ల జిల్లా, ఇల్లంతకుంట మండలం, సిరికొండ గ్రామానికి చెందిన దాసరి పరుశురాములు దుబాయ్‌లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మంచి భవిష్యత్తు కోసం, తన ముగ్గురు ఆడపిల్లల కోసం అప్పులు చేసి లక్షన్నర రూపాయలు ఏజెంట్‌కు చెల్లించి ఈ నెల 13వ తేదీన దుబాయ్ వెళ్లిన ఆయన అక్కడ మోసపోయారు.తాను దుబాయ్‌కి చేరుకున్నాక, ఏజెంట్ చెప్పిన పని, జీతం లేవని, కంపెనీ వారు వేధిస్తున్నారని పరుశురాములు ఆవేదన వ్యక్తం చేశారు. మీ ఏజెంట్ ఏం చెప్పినా మాకు సంబంధం లేదు, మేము చెప్పిన పని మాత్రమే చేయాలి. లేదంటే ఇండియన్ కరెన్సీలో రూ.2 లక్షలు కట్టి వెళ్లిపోవాలి" అని కంపెనీ యజమానులు తనను నానా దుర్భాషలాడి, పాస్‌పోర్ట్‌ను గుంజుకున్నారని బాధితుడు తెలిపారు. చేతిలో చిల్లిగవ్వ లేదని, అప్పు చేసి వచ్చిన తనను కంపెనీవారు బందీగా మార్చారని పరుశురాములు కన్నీరుమున్నీరయ్యారు.నాకు దిక్కు తోచడం లేదు సార్. నా దగ్గర రెండు లక్షలు కట్టడానికి ఏమీ లేవు. దయచేసి నన్ను మన్నించి, ఆదుకుని స్వదేశానికి రప్పించాలని "ఆయన బి ఆర్ ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల శాసనసభ్యులు కల్వ కుంట్ల తారకరామారావుని పరుశురాములు వేడుకున్నారు.

## విద్యార్థుల సమస్యలపై కేయూ జేఏసీ పోరాటం

### - నూతన కేయూ జేఏసీ ఎన్నిక



**వేద న్యూస్,కేయూ:**

విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాటాలు నిర్వహించడం కోసం కాకతీయ యూనివర్సిటీ నూతన విద్యార్థి జేఏసీ నీ నాయకులు ప్రకటించారు. కేయూ జేఏసీ చైర్మన్ ఆరేగంటి నాగరాజ్, వైస్ చైర్మన్ కేతపాక ప్రసాద్, కన్వీనర్ కందికొండ తిరుపతి, కో కన్వీనర్ అల్లం విజయ్, ప్రధాన కార్యదర్శి బోస్కా నాగరాజ్, కార్యదర్శి జనగాం రాజారాం, కోశాధికారి రేగుల నరేష్, సహాయ కార్యదర్శి సూర్య కిరణ్, జాయింట్ ట్రెజరర్ చింత ఆంజనేయులు, కమిటీ సభ్యులుగా పోతర్ల మహేష్, జీడి సుమన్, బానోత్ రాజకుమార్, శ్రీదేవి, స్రవంతి లు ఎన్నుకున్నారు. కొంతమంది యూనివర్సిటీతో సంబంధం లేని వారు యూనివర్సిటీ ప్రతిష్టను దిగజార్చే విధంగా ప్రైవేటు, విద్యాసంస్థలు హాస్పటల్ దగ్గర యూనివర్సిటీ జేఏసీ, విద్యార్థి సంఘాల నాయకులమని చెప్పుకుంటూ, దందాలు చేస్తూ చందాలు వసూలు చేస్తున్నారని, అలాంటి వారిని ఎవరు నమ్మకూడదని, అలాంటి వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని జేఏసీ నాయకులు తెలిపారు.

# భవిష్యత్తు బీజేపీదే..!

భవిష్యత్తులో బీజేపీ తిరుగులేని శక్తిగా నిలుస్తుందని కార్యకర్తలకు హామీ ఇచ్చారు. డివిజన్ పాలిటిక్స్ ఆధారంగా తెలంగాణలో అధికారం సాధ్యం కాదని, కులం-మతం ఆధారిత రాజకీయాలు శాశ్వతంగా నిలవవని తన వ్యక్తిగత అభిప్రాయాన్ని వెల్లడించారు. దేశవ్యాప్తంగా బీజేపీని ప్రజలు ఎదగనిచ్చిందంటే అభివృద్ధి-సంక్షేమం అందరికీ అందినందువల్లేనని చెప్పారు. తెలంగాణలో గతంలో జరిగిన ఉపఎన్నికల ఉదాహరణలను ప్రస్తావించిన ఈటల,

నారాయణఖేడ్, హుజూర్నగర్, పాలేరు, నాగార్జునసాగర్, కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ వంటి చోట్ల అధికార పార్టీ గెలిచిన విషయాన్ని గుర్తుచేశారు. దుబ్బాక, హుజురాబాద్ ఉపఎన్నికల్లో బీజేపీ గెలవడం ధర్మం గెలుపుగా అభివర్ణించారు. "కేసీఆర్ అహంకారం అణచడానికి ప్రజలు దుబ్బాకలో బీజేపీకి నిలబడ్డారు" అని చెప్పారు. జూబ్లీహిల్స్ ఎన్నికలో అధికార పార్టీ అనేక ప్రలోభాలు పెట్టినా గెలిచిందని, అటువంటి సమయంలో కార్యకర్తలు నిరుత్సాహపడాల్సిన అవసరం లేదని చెప్పారు. "బీజేపీ గెలిస్తే ఇవీఎంలను మేనేజ్ చేశారని అంటారు. మరి మీరు గెలిస్తే అవే ఇవీఎంలా?" అంటూ విమర్శించారు. బీహార్ ఎన్నికల్లో ముస్లిం జనాభా అధికంగా ఉన్న చోట 25 ఏళ్ల మైథిలీ ఠాగూర్ విజయం, బీజేపీకి అందరి మద్దతు ఉందని నిదర్శనమని ఈటల వ్యాఖ్యానించారు. ప్రధాని మోదీ ఇచ్చిన 'సబ్ కా సాత్ - సబ్ కా విశ్వాస్ - సబ్ కా వికాస్ - సబ్ కా ప్రయాస్' అనే నినాదమే బీజేపీ సిద్ధాంతమని అన్నారు. ప్రజలకు ఇప్పటి వరకు చేసిన పనులు, ఇక ముందు చేయబోయే కార్యక్రమాలు చెప్తూ నమ్మకం కలిగించడమే నిజమైన రాజకీయమని ఈటల సలహా ఇచ్చారు. "బరిగేసి కొట్లాడే తత్వం లేకపోతే పార్టీ ఎదగదు" అని కార్యకర్తలకు హితవు పలికారు.


## రూ.74 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కాలేజీని ప్రభుత్వ పరిధిలోకి తీసుకురావడం కాంగ్రెస్ పార్టీ చేసిన ముఖ్యపని అని గుర్తుచేశారు. ప్రాంతీయ విద్యా, మౌలిక వసతుల అభివృద్ధిలో కాంగ్రెస్ పాత్రను నేతలు ప్రస్తావించారు. తెలంగాణలో కాంగ్రెస్ పాలన ఇంకా 15 ఏళ్లు కొనసాగుతుందని, అభివృద్ధి కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి నమ్మకాన్ని వ్యక్తం చేశారు.

# డిజిటల్ అరెస్ట్ కలకలం

**- ఎమ్మెల్యే భార్యను మోసం చేసిన సైబర్ గుంపు - కడపలో 1.7 కోట్ల మోసం - ఏడుగురిని అరెస్ట్ చేసిన పోలీసులు**
**- డిజిటల్ అరెస్ట్ మోసాలపై అక్కినేని నాగార్జున హెచ్చరిక - ఆన్‌లైన్ మోసాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచనలు**

**వేద న్యూస్ డెస్క్ :** డిజిటల్ అరెస్ట్ పేరిట సైబర్ నేరస్తులు ప్రజలను భారీగా మోసం చేస్తున్న ఘటనలు రోజురోజుకు పెరుగుతున్నాయి. తాజాగా మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ భార్యను లక్ష్యంగా చేసుకొని కేటుగాళ్లు 1.7 కోట్ల రూపాయలు దోచుకున్నారు. ఈ వివాదంపై ఎమ్మెల్యే సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించగా, కేసు దర్యాప్తులో భాగంగా ఏడుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. సైబర్ నేరగాళ్లలో ఢిల్లీకి చెందిన ఐడీఎఫ్‌సీ బ్యాంక్ మేనేజర్ కూడా ఉన్నట్లు సమాచారం. డిజిటల్ అరెస్ట్ పేరిట భయభ్రాంతులకు గురిచేసి, డబ్బులు బలవంతంగా ట్రాన్స్‌ఫర్ చేయించడమే ఈ మోసగాళ్ల పద్ధతి. ఇటీవలి కాలంలో ఇటువంటి మోసాలకు అనేక మంది బలవుతున్నారని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఈ ఘటనపై సినీ నటుడు అక్కినేని నాగార్జున కూడా స్పందించారు. తమ కుటుంబంలో ఒకరు డిజిటల్ అరెస్ట్‌కు గురైన సందర్భం ఉందని, వెంటనే పోలీసులను సంప్రదించడంతో సమస్య పరిష్కారమైందని గుర్తుచేశారు. పైరసీ, సైబర్ నేరాలను అరికట్టడంలో పోలీసులు చేస్తున్న కృషిని



ఆయన అభినందించారు. హైదరాబాద్ సీపీ సజ్జనార్‌ని పలువురు సినీ ప్రముఖులు ఈ రోజు కలిసి సైబర్ మోసాలపై అవగాహన చర్యలపై చర్చించారు. ప్రజలు అపరిచిత నంబర్లకు స్పందించకుండా, వ్యక్తిగత వివరాలను పంచుకోకుండా, అనుమానాస్పద కాల్స్ వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అధికారులు సూచిస్తున్నారు.

వేద న్యూస్

మంగళవారం నవంబర్ 18, 2025

# సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే




**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ మహేష్. బి.గితే ఐపీఎస్.,తెలిపారు. సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 28 ఫిర్యాదులు స్వీకరించి, ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.

# నివారించదగిన 'మూర్ఛ'పై అపోహలు

- అవగాహన కల్పించిన డాక్టర్ కందికొండ రాజేందర్
- ప్రపంచ ఎపిలెప్సి డే సందర్భంగా..



**వేద న్యూస్, జమ్మికుంట:**

వరల్డ్ ఎపిలెప్సి డే సందర్భంగా జమ్మికుంటఅమృత న్యూరో హాస్పిటల్డాక్టర్ కందికొండ రాజేందర్ డీఎం న్యూరాలజిస్ట్ సోమవారం మూర్ఛ పై అవగాహన కల్పించారు. మూర్ఛ వ్యాధి అన్ని వయసుల వారికి రావొచ్చని, ఈ వ్యాధికి పలు రకాల కారణాలు ఉండవచ్చని చెప్పారు. చిన్నపిల్లల్లో అధిక జ్వరం, మెదడులో నిర్మాణ సంబంధిత సమస్యలు లేదా జన్యుపరమైన కారణాలు వల్ల ఫిట్స్ రావచ్చని, పెద్దవారిలో షుగర్ తక్కువ అవ్వడం, అధికంగా మద్యం సేవించడం, ప్రమాదాలలో మెదడు గాయాలు వంటి సమస్యలు సీజర్స్‌కు దారితీస్తాయని వివరించారు.

**మూర్ఛపై అపోహలు వద్దు**

మూర్ఛ వ్యాధి గురించి సమాజంలో ఇంకా చాలా అపోహలు ఉన్నాయని వెల్లడించారు. "ఒక్కసారి వస్తే తగ్గదు", "మందులు పనిచేయవు", "సైడ్ ఎఫెక్ట్స్ ఎక్కువ" వంటి అభిప్రాయాలు నిజం కావని, ఇవన్నీ కేవలం అపోహలు మాత్రమేనని డాక్టర్ రాజేందర్ స్పష్టం చేశారు. నేటి ఆధునిక వైద్యశాస్త్రంలో మూర్ఛ వ్యాధికి చాలా సమర్థవంతమైన మందులు లభ్యమవుతున్నాయని, వీటి సైడ్ ఎఫెక్ట్స్ కూడా అతి తక్కువని వెల్లడించారు. డాక్టర్‌ను సంప్రదించి కారణాన్ని నిర్ధారించుకొని సరైనచికిత్సను ప్రారంభిస్తే, చా లా మంది రోగులు పూర్తిగా నియంత్రణలో సాధా రణ జీవితం గడుపుతు న్నారని తెలిపారు. ప్రత్యే కంగా పెళ్లి వయసులో ఉన్న యువతులు ఈ వ్యాధి కారణంగా సమాజ ంలో అనవసర ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని, కానీ సరైన వైద్యచికిత్స తీసుకుంటే, వీరు కూడా అందరి లాగానే ఆరోగ్యంగా, సంతోషంగా జీవించవచ్చని చెప్పారు. పెళ్లి, గర్భధారణ, కుటుంబ జీవితంఅన్నీ డాక్టర్ సూచించిన చికిత్సతో సులభంగానే కొనసాగించవచ్చని వివరి ంచారు. మూర్ఛ వ్యాధి పై ఉన్న అపోహలను వదిలేసి, న్యూరాలజిస్ట్‌ను సంప్రదించడం అత్యంత ముఖ్యమని చెప్పారు. అన్ని వయసులవారు సరైన మందులు, నియమాలు పాటిస్తూ ఈ వ్యాధిని పూర్తిగా నియంత్రణలోకి వస్తుందని పేర్కొన్నారు.

# పీపుల్స్ పోలీస్ ఆఫీసర్ 'పింగిళి'

- వృద్ధులతో హాయిగా ముచ్చటించిన అధికారి
- వారి బాగోగులు వాకబు చేసిన ప్రశాంత్‌రెడ్డి
- కాజీపేట ఏసీపీ తీరు చూసి జనం సంతోషం






**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి/ఎల్కతుర్తి:**

ఖాకీ దుస్తులంటే కాఠిన్యం, కరుకుదనం, నిత్యం కేసులతో సతమతమయ్యే వారికి.. కటువుగా ఉండే స్వభావమే ఉంటుందనే అపోహ ఉంటుంది. కానీ,అందుకు భిన్నంగా ఏసీపీ స్థాయి అధికారి ప్రజలతో సంభాషించిన తీరుతో జనం సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరలవుతున్నాయి. సోమవారం ఎల్కతుర్తి మండల కేంద్రంలోమెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ క్యాంపులో వృద్ధ దంపతులు ముద్ర బోయిన ఐలయ్య- బుచ్చమ్మలతో కలిసి అరగంట పాటు ఏసీపీ ముచ్చటించారు. వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మూడో కంటికి తెలియకుండా వారి జేబులో డబ్బులు పెట్టారు. ఆటో పిలిపించి ఇంటికి పంపించారు. ఇది చూసిన స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. ప్రతీ పోలీస్ అధికారి ఇలానే ఉండాలని అభిప్రాయపడుతున్నారు.

# కళ్యాణలక్ష్మి చెక్కులు గోల్ మాల్..!

- కలెక్టర్ కు పిర్యాదు చేసిన బాధితులు



**వేద న్యూస్,బెజ్జంకి:**

సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలంలోని చీలాపూర్ గ్రామానికి చెందిన ధామెర స్వరూప భర్త గౌరయ్య సిద్దిపేట జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు.బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం తమ కూతురు ధామెర కళ్యాణి వివాహం అనంతరం కళ్యాణలక్ష్మీ పథకానికి దామెర స్వరూప దరఖాస్తు చేసుకోగా చెక్ రావడం జరిగినది.జూన్ 16 వ తేదీన ఎల్ ఎండి క్యాంప్ కార్యాలయంలో మానకొండూర్ ఎమ్మెల్యే డా కవ్వంపల్లి సత్యనారాయణ చేతుల మీదుగా కళ్యాణ లక్ష్మీ చెక్ పంపిణీ చేశారు. తేదీ 17-జూన్-2024 రోజున బక్రీద్ సంధర్బంగా బ్యాంక్ లకు సెలవు ఉన్నందున తేదీ 18 న యూనియన్ బ్యాంక్ అకౌంటు నెంబర్:073510100004535, బెజ్జంకిలో చెక్కు నెంబర్ "266515" జమ చేశారు. తేదీ 26-జూన్-2024 న అకౌంటు లో జమ అయినట్టు సెల్ ఫోన్ కు మెసేజ్ రావడంతో బ్యాంక్ కు వెళ్ళగా బ్యాంక్ లో క్రెడిట్ కాలేదు.బ్యాంక్ మేనేజర్ ను అడుగగా చెక్ డేట్ అయిపోయింది అని బ్యాంక్ మేనేజర్ చెక్ రిటర్న్ మరియు బ్యాంక్ రశీదు ఇచ్చారు.తిరిగి అట్టి చెక్ ను 25-జూన్-2024 న అప్పటి తహసిల్దార్ అయిన శ్రీనివాసరెడ్డి కి ఇచ్చారు.మళ్ళీ నెల తరువాత అడిగితే ఆర్డీఓ ఆఫీసు కి పంపడం జరిగిందని తహసిల్దార్ చెప్పగా, ఆర్డీఓ హుస్నాబాద్ వద్దకు వెళ్ళగా, చెక్ మా వద్దకు రాలేదని రికార్డు లో కూడా లేదని తెలిపారు.గత 17 నెలల నుంచి తహసిల్దార్ మరియు ఆర్డీఓ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా పట్టించు కోవడం లేదని సోమవారం ప్రజా వాణి లో సిద్దిపేట కలెక్టర్ కు పిర్యాదు చేశారు. అధికారుల చుట్టూ కళ్యాణ లక్ష్మీ చెక్ కోసం తిరగగా మాకు తెలవది అని అధికా రులు మమ్మల్ని పట్టించుకుంటలేరు చెక్ గురించి అడుగుతే ఏమో తెలీదు అంటూ దాట వేస్తు న్నారని, మాకు కళ్యాణ లక్ష్మీ చెక్ ఇప్పిం చగలరని బాధితురాలు దామెర స్వరూప కోరుతున్నారు.

# డిఎంహెచ్వోకు సన్మానం



**వేద న్యూస్,జోగులాంబ గద్వాల జిల్లా:**

జోగులాంబ గద్వాల జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కిరణ్మయి సోమవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలోతెలంగాణ రాష్ట్ర పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ (ఐఎన్టియుసి) జోగులాంబ గద్వాల జిల్లా ప్రెసిడెంట్ ఆర్ పి జయప్రకాష్ సారథ్యం లో ఘనంగా సన్మానం చేశారు. ముందుగా జిల్లా యూనియన్ నాయకులు శాలువా కప్పి, బొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేసి ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీబీ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రాజు, యూనియన్ సలహాదారులు సాదిక్, జనరల్ సెక్రటరీ ఆర్ కిరణ్ కుమార్, యూనియన్ నాయకులు అనిల్, కృష్ణ,నరేందర్, విజయ్, గోపాల్, వెంకటేష్, రామ్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# నేత్రదానంతో ఇద్దరు అంధులకు చూపు




**వేద న్యూస్, వరంగల్ టౌన్:**

వరంగల్ పిన్నవారి వీధి వజనపల్లి రంగమణి (95)అనారోగ్యం తో సోమవారం మృతి చెందారు. వారి కుమారులు రమేష్, గోపాల్ కూతురు శాంతి, కోడళ్ళు సరస్వతి, మణెమ్మ, నిర్మల "సమాజ హితం కోరి, "నేత్రదానం చేయడానికి అంగీకరించారు.తెలంగాణ నేత్ర అవయవ శరీర దాతల అసోసియేషన్ వరంగల్ ఆధ్వర్యంలో వరంగల్ ప్రాంతీయ నేత్ర వైద్యశాల ఎల్వీ ప్రసాద్ నేత్ర సేకరణ టెక్నీషియన్ నరేందర్ ద్వారా నేత్రదానం కార్నియా సేకరణ చేశారు. రంగమణి నేత్రదానంతో ఇద్దరి అంధులకు చూపునిచ్చిన వారయ్యారు. నేత్ర వైద్యుల వైద్య విద్యకు ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బంధుమిత్రులు, అసోసియేషన్ వరంగల్ జిల్లా అధ్యక్షులు కోన్ రెడ్డి మల్లారెడ్డి,ఆడెపురాజేంద్ర ప్రసాద్ ప్రధాన కార్యదర్శి పాల్గొన్నారు.

# టీపీసీసీ చీఫ్ పరామర్శ

- సౌదీ బస్సు ప్రమాదంలో మృతుల కుటుంబాలకు టీపీసీసీ చీఫ్ పరామర్శ



**వేద న్యూస్, హైదరాబాద్ :**

సౌదీ అరేబియాలో జరిగిన దారుణ బస్సు ప్రమాదంలో మృతి చెందిన తెలంగాణ వాసుల కుటుంబాలను టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ పరామర్శించారు. అడిక్ మెట్ అచ్యుత్ మార్గ్ ప్రాంతంలో పర్యటించిన ఆయన, కుటుంబ సభ్యులను ధైర్యం చెప్పి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఏఐసీసీ కార్యదర్శి సంపంత్ కుమార్, నాంపల్లి ఇన్‌ఛార్జ్ ఫిరోజ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని కాంగ్రెస్ తరఫున మహేష్ గౌడ్ భరోసా ఇచ్చారు. మృతదేహాల రప్పింపు, ఆర్థిక సహాయం, కుటుంబ సభ్యులకు అవసరమైన మద్దతు అందించే దిశగా కాంగ్రెస్ పార్టీ తరఫున అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ఈ విషాద సమయంలో బాధితులకు ప్రభుత్వం మరియు పార్టీ కలసికట్టుగా సహాయం చేస్తుందని నాయకులు హామీ ఇచ్చారు.

# కబ్జాదారులపై క్రిమినల్ చర్యలు తీసుకోండి..!

- కలెక్టర్ ను కోరిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



**వేద న్యూస్, పార్వతీపురం మన్యం జిల్లా :**

పార్వతీపురం పట్టణం నడిబొడ్డున ప్రవహిస్తూ ప్రకృతి వరంగా లభించిన వరహాలు గెడ్డను రాబందుల నుండి రక్షించాలని భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. ఆ పార్టీ ఓబీసీ జిల్లా చైర్మన్ వంగల దాలి నాయుడు, ఎస్సీ సెల్ చైర్మన్ కోలా కిరణ్ కుమార్, మండల అధ్యక్షులు తీళ్ల గౌరీ శంకరరావు తదితరులు సోమవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్. ప్రభాకర్ రెడ్డిని కలిసి వరహాల గెడ్డ కబ్జాలపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల వరహాల గెడ్డను కొంత మంది అక్రమార్కులు ప్రైవేటు వ్యక్తులకు రిజిస్ట్రేషన్ చేసినట్లు వార్తా పత్రికల్లో కథనాలు వస్తున్నాయన్నారు. తక్షణమే వరహాల గెడ్డను పాత రికార్డులు ప్రకారం సర్వే చేయించి, హద్దులు నిర్ణయించాలన్నారు. పట్టణ మెయిన్ రోడ్డుకు పక్కనే ఉన్న వరహాల గెడ్డపై వాకింగ్, రన్నింగ్ ట్రాక్ ఏర్పాటు చేసి ప్రజలకు ఉపయోగకరంగా మలచాలన్నారు. పెన్నా పెద్ద సేద తీరేందుకు బెంచీలు, పూలవనాలు ఏర్పాటు చేయాలన్నారు. వరహాలు గెడ్డను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని కోరారు. గతంలో శ్వేతా మహంతి సబ్ కలెక్టర్ గా పని చేసినప్పుడు వరహాల గెడ్డ కబ్జాలను తొలగించారన్నారు. ఆమెను స్ఫూర్తిగా తీసుకొని వరహాల గెడ్డ కబ్జాలను తొలగించాలన్నారు. కబ్జాదారులపై, అక్రమ రిజిస్ట్రేషన్ కు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. సంబంధిత అధికారులను తక్షణమే సస్పెండ్ చేయాలన్నారు. కోట్లాది రూపాయల విలువైన వరహాల గెడ్డపై అక్రమార్కుల కళ్ళు పడ్డాయని, ఇప్పట్లో గెడ్డను రక్షించకపోతే, భవిష్యత్తులో వరహాలు గెడ్డ కనుమరుగవుతుందన్నారు. ఈ సందర్భంగా వినతి పత్రాన్ని అందజేశారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073

వేద న్యూస్



# డిప్యూటీ సీఎంను కలిసిన కేయూ రిటైర్డ్ టీచర్స్ అసోసియేషన్ కుర్టా

**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**

కుర్టా కార్యవర్గం, వరంగల్ ఈస్ట్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డితో కలిసి, సోమవారం తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రికి కాకతీయ విశ్వవిద్యాలయానికి పెండింగ్‌లో ఉన్న పెన్షన్ నిధులను తక్షణమే విడుదల చేయాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. ఈసమావేశంలో కుర్టా అధ్యక్షులు ప్రొఫెసర్ ఏ. సదానందం వివరించారు. ఇటీవలి ఆర్థికశాఖ ఆదేశాల ప్రకారం విశ్వవిద్యాలయాలు జీతాలు, పెన్షన్‌లకు వేర్వేరు బిల్లులు పంపాలని సూచించబడింది. దీని ఫలితంగా జీతాల బిల్లులు క్లియర్ అవుతున్నప్పటికీ, పెన్షన్ బిల్లులు గత కొన్ని నెలలుగా పెండింగ్‌లోనే ఉన్నాయి, ఇది ఇప్పటికే పరిమిత వనరులతో నడుస్తున్న విశ్వవిద్యాలయంపై అదనపు భారం పడుతోంది. ఆర్థిక మంత్రి సమస్యను శ్రద్ధగా విని, పరిస్థితి యొక్క తీవ్రతను పూర్తిగా అర్థం చేసుకుని, ప్రతినిధి బృందానికి ఆందోళన అవసరం లేదని హామీ ఇచ్చారు. ప్రభుత్వ అకౌంటింగ్ నిబంధనల ప్రకారం జీతం బడ్జెట్‌లో పెన్షన్ కూడా అంతర్భాగమే అని అసోసియేషన్ ఇచ్చిన వివరణను మంత్రి అంగీకరించారు. కుర్టా, మంత్రి అవగాహన, సానుకూల స్పందనకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కీలకమైన సమావేశం జరిగేందుకు ప్రత్యేకంగా ముందడుగు వేసిన



ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డికి కుర్టా అసోసియేషన్ ధన్యవాదాలు తెలిపారు. ఈ సమస్య త్వరితగతిన పరిష్కారమై, కాకతీయ విశ్వవిద్యాలయానికి పెన్షన్ నిధులు క్రమం తప్పకుండా విడుదల అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ప్రొఫెసర్ ఎం. ఎర్రగట్టు స్వామి, ప్రొఫెసర్ వి. రవీందర్, ప్రొఫెసర్ జి. వీరన్న, ప్రొఫెసర్ కె. వెంకటనారాయణ, ప్రొఫెసర్ ఈ. రామ్ రెడ్డి పాల్గొని తమ అభిప్రాయాలు తెలియజేశారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వేగవంతం



**వేద న్యూస్, ఇల్లందు :**

రాష్ట్రంలో పేదల గృహ నిర్మాణ ప్రక్రియ వేగంగా సాగుతున్నదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. దశాబ్ద కాలం పాలించిన గత ప్రభుత్వాలు ఆత్మగౌరవ భవనాలు కడతామని చెప్పినా, మొండి గోడలతో ఉన్న నిర్మాణాలు మాత్రమే కనిపిస్తున్నాయని ఆయన విమర్శించారు. నిజమైన ప్రణాళికతో పేదల కోసం ఇళ్లు కట్టేది ప్రస్తుత ప్రజా ప్రభుత్వమేనని అన్నారు. ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పెద్దఎత్తున జరుగుతుందని, ఇప్పటికే అనేక లబ్ధిదారులు గృహప్రవేశాలు కూడా చేసుకుంటున్నారని మంత్రి వివరించారు. గ్రామీణ మరియు గిరిజన ప్రాంతాల్లో ఇంటి కల నెరవేరుతున్నదని తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో గృహాల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి పెట్టిన ప్రభుత్వం, ఐటీడీఏ పరిధిలోని నియోజకవర్గాలకు అదనంగా 1,500 ఇండ్లు కేటాయించి మొత్తం 5,000 ఇందిరమ్మ ఇండ్లను అందిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. గిరిజన కుటుంబాలు సురక్షిత గృహాలను పొందేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇల్లందు మండల కేంద్రంలో గిరిజ న లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూ రు పత్రాలను మంత్రి స్వయంగా పంపిణీ చేశారు. లబ్ధిదారుల కలల ఇల్లు త్వరగా పూర్తవాలని, ప్రభుత్వం వారి అభి.వృద్ధికి అండగా నిలుస్తుందని ఆయన హామీ ఇచ్చారు.

# తెల్లవారుజామున ప్రయాణాలు చేయకండి

**– సీపీ సన్ ప్రీత్ సింగ్**




**వేద న్యూస్, వరంగల్ క్రైమ్:**

వాతావరణంలో పొగమంచు తీవ్రత పెరగటంతో వీలైనంత వాహనదారులు రాత్రి, తెల్లవారుజామున ప్రయాణాలు చేయద్దని వరంగల్ పోలీస్ కమిషనర్ ప్రజలకు సూచించారు. వాతావరణంలో పొగమంచు తీవ్రత పెరగడం కారణంగా జరిగిన రోడ్డు ప్రమాదాల నేపథ్యంలో ప్రజలను వరంగల్ పోలీస్ కమిషనర్ ప్రకటన చేస్తూ రాత్రి, తెల్లవారుజామున దట్టమైన పొగమంచు కారణంగా రహదారులపై ఎదురుగా వచ్చే వాహనాలు, పాదాచారులను గుర్తించడం, వీక్షించే సామర్థ్యం తక్కువుగా వుంటుంది. ఈ సమయంలో చిన్నపాటి నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదాలకు దారితీసే అవకాశాలు ఉన్నందున, ప్రజలు అత్యవసరమైతే తప్ప ఈ సమయాల్లో ప్రయాణాలను మానుకోగలరని వరంగల్ సీపీ ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు. అలాగే పొగమంచు ఎక్కువగా ఉండే సమయంలో వాహనాలు నడుపుతున్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సీపీ సూచిస్తూ వాహనాలను వేగంగా నడపొద్దని, వాహనదారులు శ్రద్ధతో, నిదానంగా ప్రయాణించాలి. తక్కువ వీక్షించే సామర్థ్యం కారణంగా ఇతర వాహనాలు, పాదచారులు, మలుపులు, రోడ్డు విభాగాలు సరిగా కనిపించక ప్రమాదాలు సంభవించే అవకాశం ఉన్నందున, హెడ లైట్లను లో బీమ్‌లో ఉంచి, ఫాగ్ లైట్లను వాడాలని సూచించారు. అత్యవసర సమయాల్లో ప్రయాణం తప్పనిసరి అయితే వాహనాల స్థితిని ముందుగానే తనిఖీ చేసుకోవంతో పాటు ముఖ్యంగా బ్రేకులు, లైట్లు, టైర్లు సరిగా ఉన్నాయో లేదో సరి చూసుకోవాలని డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగం, ఆకస్మికంగా ఓవర్‌టేక్ చేయడం, ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘించడం వంటి ప్రమాదకరమైన చర్యలకు పాల్పడవద్దని పోలీసుల సూచనలతో పాటు ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ వాహనదారులు వారి గమ్యస్థానాలకు క్షేమంగా చేరుకోవడమే వరంగల్ పోలీస్ కమిషనర్ ప్రధాన లక్ష్యమని సీపీ వెల్లడించారు.

# ఐబొమ్మ..బప్పంపై గట్టి వేట..!

**– భారీ పైరసీ నెట్‌వర్క్‌ను ఛేదించిన హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు**

**– 65కి పైగా మిర్రర్ వెబ్‌సైట్లు నిర్వహించిన ప్రధాన నిందితుడు అరెస్ట్**

**వేద న్యూస్, హైదరాబాద్ :**



టాలీవుడ్ చిత్ర పరిశ్రమకు భారీ నష్టాన్ని కలిగిస్తున్న అంతర్జాతీయ స్థాయి పైరసీ మాఫియాపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసు బృందం పెద్ద వేట చేపట్టింది. ఐబొమ్మ – బప్పం పైరసీ నెట్‌వర్క్‌ను నిర్వహిస్తున్న ప్రధాన నిందితుడు ఎమండి రవిను పోలీసులు అరెస్టు చేసినట్లు ఐపీఎస్ అధికారి వీ.సీ. సజ్జనార్ వెల్లడించారు. నిందితుడు 65కు పైగా మిర్రర్ వెబ్‌సైట్లను నడుపుతూ, కొత్తగా విడుదలయ్యే తెలుగు సినిమాలను అక్రమంగా అప్‌లోడ్ చేసి, చిత్ర పరిశ్రమకు వేల కోట్లు నష్టం కలిగించినట్లు దర్యాప్తులో తేలింది. పైరసీ సైట్లకు వచ్చే ట్రాఫిక్‌ను వంటి బెట్టింగ్ ప్లాట్‌ఫారమ్‌లకు అక్రమంగా మళ్లించి, పెద్ద మొత్తంలో ఆర్థిక మోసాలకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఇటీవలి కాలంలో విడుదలైన 'కాంతారా చాప్టర్ 1', 'డ్యూడ్', 'మిరాయ్' వంటి సినిమాలు ఈ నెట్‌వర్క్‌లో అక్రమంగా అప్‌లోడ్ చేయబడ్డాయి. పెద్ద ఎత్తున డేటా విశ్లేషణ, డిజిటల్ సాక్ష్యాలు, అంతర్జాతీయ లాగ్ ట్రాకింగ్ ఆధారంగా ఈ ఆపరేషన్‌ను పోలీసులు విజయవంతంగా పూర్తి చేశారు. సైబర్ క్రైమ్ విభాగం ఈ కేసును విస్తృతంగా దర్యాప్తు చేస్తూ, ఈ నెట్‌వర్క్‌కు సంబంధించి మరిన్ని అరెస్టులు జరిగే అవకాశం ఉందని అధికారులు తెలియజేశారు.

# ఆప్ ద్వారా ఫిర్యాదులు చేసేలా అవగాహన కల్పించండి

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**

మై జీడబ్ల్యూఎంసి ఆప్ ద్వారా ఫిర్యాదులు చేసేలా నగర ప్రజల్లో అవగాహన కల్పించాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయం లోని కౌన్సిల్ హాల్ లో వివిధ విభాగాలకు చెందిన ఉన్నతాధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కమిషనర్ పాల్గొని సమర్థవంతంగా నిర్వహించుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర పరిధిలోని 18, 19వ డివిజన్ లలో ప్రభుత్వ భూమిని ఆక్రమించినట్లుగా ఫిర్యాదులు వచ్చాయని టౌన్ ప్లానింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో సందర్శించి అందుబాటు లో ఉన్న ఖాళీ స్థలం చుట్టు కంచె (ఫెన్సింగ్) వేయాలని ఒకవేళ ఎవరైనా అభ్యంతరాలు వ్యక్తం చేస్తే అట్టి మండల పరిధి లో గల తహసీల్దార్ కు ఫిర్యాదు చేయాలని సూచించాలని ,మై జీ డబ్ల్యూఎంసీ ఆప్ గురించి ప్రజల్లో చైతన్యం కలిగించాలని ప్రజలకు ఏమైనా సమస్యలు ఉంటే గ్రీవెన్స్ కు వచ్చి ఫిర్యాదు చేయకుండా ఉండాలంటే ఈ అప్ లో ఫిర్యాదు చేసేలా నగర వాసులకు అవగాహన కలిగించేలా అధికారులు వార్డు ఆఫీసర్లు సిబ్బంది కృషి చేయాలని వివిధ అభివృద్ధి పనులకు చెందిన డాక్యుమెంట్స్ (ఏంబిలు) తదితరాల పత్రాల కదలిక తో పాటు బిల్లుల చెల్లింపు లు సంబంధిత ఫైల్స్ అకౌంట్స్ వరకు చేరే ప్రక్రియ జీఐఎస్ ద్వారా నమోదు జరగాలని దీని వల్ల భవిష్యత్తులో ఫైల్ కదలిక లు సులభంగా చూడవచ్చని ఇందుకోసం అధికారులకు సాంకేతిక శిక్షణ అందించేలా చూడాలని ,అసెస్మెంట్ ల సమాచారం తప్పుగా నమోదు ఐన తరుణం లో అట్టి గృహాలకు 25 సార్లు పెనాల్టీ విధించిన నేపథ్యం లో వాటిని తొలగించడానికి మిషన్ మోడ్ లో చేపట్టి డివిజన్ ల వారిగా ఆర్ఐ లకు జాబితాలు అందజేసి వారి పరిధి లో 25 సార్లు పెనాల్టీ పడిన నిర్మాణాలకు తొలగింపు చేసి వారు ఇప్పటి వరకు బకాయి పడి ఉన్న ఆస్తి నల్ల పన్ను ల మొత్తాన్ని చెల్లించేలా చూడాలని కమిషనర్ అన్నారు. ఇటీవల వరదల వల్ల సంభవించిన



నష్టానికి చెందిన రిపోర్ట్ ను అధికారులు అందజేయాలని ,మేయర్ సూచించినట్లు అత్యవసరంగా నిర్మించాల్సిన డ్రైన్ లు వాటికి అనుసంధానం గా ఉన్న నాలా లకు చెందిన నిర్మాణాలకు చెందిన ప్రతి పాదనలు ఇంజనీరింగ్ అధికారులు అందజేయాలన్నారు. నగరంలో కమ్యూనిటీ హాల్ లకు సంబంధించిన ఆస్తి బల్దియా ది అని, కొన్ని ప్రాంతాల్లో నిర్వహణ సక్రమం గా ఉందని కొన్ని చోట్ల లోప భూఇష్టంగా ఉందని ఇది సరికాదని నిరుపేదలు శుభకార్యాలు నిర్వహించుకునే విధం గా ధరలు అందుబాటు లో ఉండాలని పెద్ద కమ్యూనిటీ హాల్ లు డిప్యూటీ కమిషనర్ (అడ్మిన్) అధీనం లో ఉంటూ పారదర్శకం గా నిర్వహించేలా చూడాలని కమ్యూనిటీ హాల్ ను ఆన్ లైన్ ద్వారా బుకింగ్ చేసుకోవడానికి వీలుగా ఏర్పాటు చేయాలని గ్రీవెన్స్ ఫిర్యాదుకు సంబంధించిన శానిటేషన్ వీధి దీపాలు టౌన్ ప్లానింగ్ విభాగాలకు చెందిన ప్రతి వారం అందజేసిన ఫిర్యాదుల పురోగతిని కాల్ సెంటర్ సిబ్బంది ఫిర్యాదు దారులకు ఫోన్ చేసి సమస్యల పురోగతిని అడిగి తెలుసుకొని అట్టి స్టేటస్ ను రికార్డులో నమోదు చేయాలని కమిషనర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చంద్రశేఖర్, ఎస్ఈ సత్యనారాయణ, సిఎంహెచ్ ఓ డా.రాజారెడ్డి, డిఎఫ్ఓ శంకర్ లింగం, సిహెచ్ఓ రమేష్, ఇంచార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్ ప్రసన్న రాణి, పన్నుల అధికారి రామకృష్ణ, ఏంహెచ్ఓ డా.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# శిక్షణా కార్యక్రమం

**– 'పశువులలో యాంటి మైక్రోబియల్ నిరోధకత– పరిష్కారాలు"అనే అంశంపై..**




**వేద న్యూస్, జమ్మికుంట:**


పీవీ నరసింహారావు తెలంగాణ పశు వైద్య విశ్వవిద్యాలయం పరిధిలోని మామునూరు, జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రాలు, సత్గురు మేనేజ్మెంట్ కన్సల్టెంట్స్ ఆధ్వర్యంలో 'పశు ఆరోగ్య సంరక్షణ, మెరుగైన యాజమాన్య పద్ధతులు, విచక్షణా పూరిత యాంటి బయోటిక్స్ వినియోగం' ద్వారా అన్ని జీవులలో ఆరోగ్య పరిరక్షణ వంటి అంశాలపైన రెండు రోజుల శిక్షణ కార్యక్రమం కేవీకే జమ్మికుంటలో సోమవారం ప్రారంభమైంది. విస్తరణ సంచాలకులు డాక్టర్ ఎమ్ కిషన్ కుమార్ మాట్లాడుతూ.. యాంటి బయాటిక్స్ అతి వినియోగంతో పశువులకు ముప్పు, ప్రజల ఆరోగ్యంతో పాటు ప్రాణాలకు ముప్పు వాటిల్లుతోందని చెప్పారు. అధిక పాల దిగుబడులు, మాంసం కోసం పశువులకు విచక్షణా రహితంగా యాంటి బయాటిక్స్ వాడకూడదని పేర్కొన్నారు. అదేవిధంగా జీవ సంరక్షణ పద్ధతులను పాటించాలని సూచించారు. ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎస్ బిందు మాధురి మాట్లాడుతూ.. పశువులలో సూక్ష్మజీవనాశక ఔషధాల నిరోధకత ఒక నిశ్శబ్ద విపత్తుగా మారుతోంది అని చెప్పారు. ఇది కేవలం పశువుల ఆరోగ్యానికే కాదు, మానవ జీవన భద్రతకూ ముప్పు కలిగిస్తుందని వెల్లడించారు. కాబట్టి మందుల వినియోగంలో జాగ్రత్తలు, పరిశుభ్రత, శిక్షణ, ప్రభుత్వ పర్యవేక్షణ అనే నాలుగు అంశాలను సమన్వయం చేస్తే మాత్రమే ఈ సమస్యను నియంత్రించవచ్చునని పేర్కొన్నారు. పాడి రైతులకు యాంటీబయాటిక్స్ అదే విధంగా పశువులు, మానవులకు యాంటీబయాటిక్స్ ఉన్న సంబంధాలు, ముప్పులు గురించి తెలియచేసారు. డాక్టర్ వంశీకృష్ణ యాంటీబయాటిక్స్ వాడకం, వాటి మోతాదు ఎక్కువగా వాడితే కలిగే నష్టాల గురించి రైతులకు శిక్షణ ఇచ్చారు. డాక్టర్ అంబికా మాట్లాడుతూ..పాకల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, షెడ్ ని నిరంతరం పరిశుభ్రం గా ఎలా ఉంచుకోవాలి అనే అంశాల పై వివరించారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని డా ఎన్. వెంకటేశ్వర రావు సీనియర్ సైంటిస్టు, హెడ్ కేవీకే, మత్స్య విభాగ శాస్త్రవేత్తప్రభాకర్ కోరారు.

# జమ్మికుంటలో వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోబ

**వేద న్యూస్, జమ్మికుంట:**

జమ్మికుంట పట్టణంలోని బొమ్మలగుడి విశ్వేశ్వరఆలయ ప్రాంగణంలో హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో కార్తీక మాసం చివరి సోమవారం నాడు నిర్వహించిన కార్తీక దీపోత్సవం ఘనంగా జరిగింది. ఈ లక్షదీపోత్సవం కార్యక్రమానికి మహిళలు, భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. లక్ష దీపాల కాంతులతో మైదానమంతా ఆధ్యాత్మికంగా వెల్లివిరిసింది. సంప్రదాయ వస్త్రధారణలో దీపోత్సవానికి వచ్చిన మహిళలు, యువతుల ఓంకార నాదాలు, వేదమంత్రాలతో ప్రాంగణం హోరెత్తింది. పూజారులు సనాతన ధర్మం, శివతత్వం గురించి చెప్పారు. సుమారు మూడు గంటల పాటు జరిగిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో మహిళలు భక్తి ప్రవత్తులతో దీపాలు వెలిగించి భోళా శంకరుడిని ప్రార్థించారు.

**– భక్తి శ్రద్ధలతో లక్ష దీపోత్సవం**



# ఐబొమ్మ రవిపై శివాజీ ఇంట్రెస్టింగ్ కామెంట్స్



వేద న్యూస్ డెస్క్:

తెలుగు సినీ పరిశ్రమకు తీవ్ర నష్టాన్ని కలిగించిన పైరసీ వెబ్‌సైట్‌లు ఐబొమ్మ , బప్పం టీవీ లను సైబర్ క్రైమ్ పోలీసులు అధికారికంగా మూసివేయించారని తెలిసిందే. ఈ వెబ్‌సైట్‌ల నిర్వాహకుడు ఇమ్మడి రవిని శనివారం అరెస్టు చేసిన పోలీసులు అతనితోనే ఆయా వెబ్‌సైట్‌ల కార్యకలాపాలను పూర్తిగా నిలిపివేయించినట్లు సమాచారం. కాగా దండోరా సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌లో యాక్టర్ శివాజీ ఐబొమ్మ రవిపై ఆసక్తికర కామెంట్స్ చేశాడు.వాడికేదో బాధ.. మొత్తానికి వాడిని పట్టేశారు. కానీ ఆ అబ్బాయి మంచి హ్యాకర్ అని విన్నాను. ఆ అబ్బాయిని మంచి పని కోసం వాడుకోవాలని కోరుకుంటున్నా. అతడు కనీసం ఇక నుంచి మారి దేశానికి ఉపయోగపడే మనిషిగా తయారైతే బాగుంటుందన్నాడు శివాజీ. టాలెంట్ ఎవడి సొత్తు కాదండి. అతను నిరూపించాడు. చేసింది చాలా దుర్మార్గమైన పని అయినా సరే.. అతని టాలెంట్ గురించి వింటుంటే.. నిజంగా వాడు ఒక దేశానికి పనికొస్తాడు కదా.. ఈ మనిషిని ఎక్కడన్నా సెక్యూరిటీ సిస్టమ్‌లో అతని వినియోగించుకోవచ్చు కదా అని నాకు అనిపించింది. కానీ తెలిసీ తెలియని వయస్సు.ఖచ్చితంగా ఏదో ఒక డబ్బు లేని తనం. ఇవన్నీ వెంటబడి అతడి మైండ్‌లో ఇలాంటి ఒక ఆలోచన వచ్చి చాలా మందిని ఇబ్బంది పెట్టాడు. అతనికి తెలియదు చాలా మందికి ఉపయోగపడుతున్నాననుకున్నాడు కానీ. మనకంటూ ఒక రాజ్యాంగం ఉంది.. దానికి లోబడి అందరం బతకాలి కాబట్టి.. ఇకనుంచైనా అతడు మారాలని కోరుకుంటున్నానన్నాడు శివాజీ. ఇప్పుడీ కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి.కాగా ఇమ్మిడి రవి నుంచి వెబ్ లాగిన్‌లు, సర్వర్ వివరాలను సేకరించి, అతడి సమక్షంలోనే ఆ పైరసీ వేదికలను శాశ్వతంగా క్లోజ్ చేయించినట్లు తెలుస్తుంది. ప్రస్తుతం నిందితుడు ఇమ్మడి రవి నుంచి స్వాధీనం చేసుకున్న వందల సంఖ్యలో ఉన్న హార్డ్ డిస్క్‌లను పోలీసులు క్షుణ్ణంగా విశ్లేషిస్తున్నారు. అలాగే, అతని బ్యాంక్ ఖాతాల ఆర్థిక లావాదేవీల వివరాలను పరిశీలిస్తున్నారు. ఈ పైరసీ సామ్రాజ్యం వెనుక ఉన్న వ్యక్తులు, ఆర్థిక వనరులపై లోతుగా దర్యాప్తు చేసేందుకు పోలీసులు సన్నద్ధమవుతున్నారు.

# అల్లు అర్జున్ ఫోన్ వాల్‌పేపర్ వైరల్ !

## – ఆ రూల్‌నే ఫాలో అవుతామంటున్న ఫ్యాన్స్

వేద న్యూస్ డెస్క్:




టాలీవుడ్ స్టార్ యాక్టర్ అల్లు అర్జున్ ప్రస్తుతం కోలీవుడ్ డైరెక్టర్ అట్లీ దర్శకత్వంలో సినిమా చేస్తున్నాడని తెలిసిందే. (వర్కింగ్ టైటిల్) ప్రాజెక్ట్‌గా వస్తున్న ఈ మూవీ షూటింగ్ దశలో ఉంది. బాలీవుడ్ భామ దీపికా పదుకొనే ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుంది. అల్లు అర్జున్‌కు సంబంధించిన ఓ విషయం ఇప్పు డు టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారింది. అల్లు అర్జున్ వ్యక్తిగత జిమ్ ట్రైనర్ లియోర్డ్ స్టీవెన్స్ ఇన్‌స్టాగ్రామ్‌లో చిన్న వర్క వుట్ క్లిప్‌ను పోస్ట్ చేశాడు. ఈ వీడియో లో ట్రేడ్ మిల్‌పై ఉన్న అల్లు అర్జున్ ఫోన్ వాల్‌పేపర్ అందరి దృష్టిని ఆకర్షిస్తు ంది. ఈ క్లిప్ ఆదివారం ఉదయం 10:18 గంటల(నవంబర్ 16, 2025)కు క్లిక్‌మనిపించింది కాగా టైం కింద 2026 మార్చి 27 కూడా ఉంది. వాల్‌పేపర్‌పై నో స్నాక్ నో షుగర్ నో సోడా అనే మూడు సింపుల్ లైన్స్ ఉన్నాయి.ఇక లైన్స్ ఈ లైన్స్ చదివిన అభిమానులు అల్లు అర్జున్ 2026 మార్చి 27 వరకు నో స్నాక్ నో షుగర్ నో సోడా నిబంధనను ఫాలో అవుతాడని క్లారిటీకి వచ్చేస్తున్నారు. అల్లు అర్జున్ క్రమశిక్షణ, ఖచ్చితత్వానికి ఇంప్రెస్ అయిన అభిమానులు తాము కూడా అదే రూల్‌ను ఫాలో అవుతామని చెబుతున్నారు.అట్లీతో బన్నీ చేయబోయే సినిమా 2027లో పూర్తవుతుందని హింట్ ఇచ్చిన మేకర్స్ ఎప్పటివరకు అనేది మాత్రం స్పష్టత ఇవ్వలేదు. సన్ పిక్చర్స్ బ్యానర్‌పై కళానిధి మారన్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి సాయి అభ్యాంకర్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.

# శివ వైబ్స్ రీక్రియేట్ చేస్తున్న నాగార్జున..

వేద న్యూస్ డెస్క్:



అక్కినేని నాగార్జున నటించిన ఐకానిక్ మూవీ శివ ఇటీవలే గ్రాండ్‌గా రీరిలీజ్ అయిన విషయం తెలిసిందే. రీరిలీజ్‌లో సూపర్ రెస్పాన్స్ రాబట్టుకుంది శివ. ఇక మరోసారి శివ సినిమా నాటి వైబ్స్ క్రియేట్ చేస్తునాృడు నాగార్జున. చైన్ బ్రాస్‌లెట్‌ను అరచేతిలో మడిచి పట్టుకున్న నాగార్జున బ్లాక్ డ్రెస్‌కు మ్యాచ్ అయ్యే గాగుల్స్‌తో స్టైలిష్‌గా రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌పై కూర్చొని కెమెరాకు ఫోజులిచ్చాడు.‘1989 నాటి కాలం నుండి 2025 వరకు అతడి తేజస్సు సున్నితంగా గాలిలా ప్రయాణిస్తుంది అయినప్పటికీ అతడి చరిష్మా శాశ్వతమైనది.. సొగసైనది. .మరపురానిది..’ అనే క్యాప్షన్‌తో పోస్ట్ చేసిన తాజా స్టిల్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఆరు పదుల వయస్సు దాటినా కుర్ర హీరోలకు ఏ మాత్రం తగ్గేదేలే అంటూ తాజా స్టిల్స్‌తో చెప్పకనే చెప్పేస్తున్నాడు నాగార్జున.ఈ ఏడాది కుబేర, కూలీ సినిమాలతో సూపర్ హిట్స్ అందుకున్నాడు టాలీవుడ్ యాక్టర్ అక్కినేని నాగార్జున. నాగార్జున ప్రస్తుతం కెరీర్‌లో ల్యాండ్ మార్క్ సినిమాగా నిలిచిపోయే 100వ ప్రాజెక్ట్‌పై వర్క్ చేస్తున్నాడు. ఈ చిత్రాన్ని తమిళ దర్శకుడు రా కార్తీక్ డైరెక్ట్ చేస్తున్నాడు. ఈ మూవీని నాగార్జున 2026 మే నెలలో సమ్మర్ కానుకగా అభిమానుల ముందుకు తీసుకురావాలని ప్లాన్ చేస్తున్నట్టు ఇప్పటికే వార్తలు రాగా.. నాగార్జున టీం నుంచి క్లారిటీ రావాల్సి ఉంది.

# మల్లన్న జాతర ఏర్పాట్లు వేగవంతం చేయాలి

వేద న్యూస్, సిద్ధిపేట :



రాబోయే కొమురవెల్లి శ్రీ మల్లికార్జున స్వామివారి కళ్యాణం మరియు జాతరను అత్యంత వైభవంగా, శ్రద్ధాభక్తులతో నిర్వహించేందుకు అన్ని విభాగాలు సిద్ధంగా ఉండాలని మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. సిద్ధిపేట జిల్లా ఎండోమెంట్ ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన ఆమె, జాతరకు లక్షలాదిగా వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగాలంటూ సూచనలు జారీ చేశారు. భక్తుల రాకపోకలను దృష్టిలో ఉంచుకుని రోడ్డు మార్గాలను మెరుగుపర్చడం, ట్రాఫిక్ నిర్వహణకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయడం అత్యవసరమని ఆమె పేర్కొన్నారు. జాతర కాలంలో భద్రతా చర్యల పర్యవేక్షణ కోసం పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, రెవెన్యూ అధికారులు సన్నద్ధంగా ఉండాలని ఆదేశించారు. త్రాగునీరు, పారిశుద్ధ్యం, పార్కింగ్ వంటి సేవల్లో ఎలాంటి లోపాలు ఉండకూడదని, ప్రతి అంశానికి ప్రత్యేక నోడల్ అధికారులను నియమించాలని సూచించారు.ఆలయాభివృద్ధికి సంబంధించిన పనులను పరిశీలించిన మంత్రి, పెండింగ్‌లో ఉన్న రహదారుల అభివృద్ధి, విద్యుత్ లైటింగ్, డ్రైనేజ్ సదుపాయాలను తక్షణం పూర్తి చేయాలని ఆదేశించారు. జాతర ప్రారంభానికి ముందే అన్ని పనులు పూర్తవ్వాలని స్పష్టమైన గడువు విధించారు. భక్తులకు క్యూ లైన్లలో నీడ సదుపాయాలు, వైద్య సేవలు, అత్యవసర సహాయ కేంద్రాలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. జాతర సమయంలో సాంస్కృతిక కార్య్ర కమాలు, సేవా కార్యకలాపాలు నిర్వహించే వాలంటీర్లతో కూడిన ప్రత్యేక బృందాలను సమన్వయంతో పనిచేయేలా సూచించారు. భక్తుల ఆరోగ్య భద్రత కోసం వైద్య బృందాలు, అంబులెన్స్‌లు సిద్ధంగా ఉండాలని, జాతర ప్రాంతంలో బోర్డులు, గైడెన్స్ మ్యాప్‌లు ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. కొమురవెల్లి మల్లన్న జాతర రాష్ట్రంలో అత్యంత రద్దీ జాతరల్లో ఒకటైనందున, భక్తుల విశ్వాసానికి ఏమాత్రం భంగం వాటిల్లకుండా ప్రభుత్వ యంత్రాంగం పూర్తి స్థాయిలో పని చేయాలని కొండ సురేఖ పునరుద్ఘాటించారు.

# దివాలా తీసిన బైజూస్ కొనుగోలుకు మరో ప్రయత్నం

వేద న్యూస్ డెస్క్:




దివాలా తీసిన బైజూస్‌ను కొనుగోలు చేయడానికి మణిపాల్ గ్రూప్ తన బిడ్‌ను కొనసాగించింది. దివాలా ప్రక్రియ కింద బైజూస్ మాతృ సంస్థ థింక్ అండ్ లెర్న్ ప్రైవేట్ లిమిటెడ్‌ను కొనుగోలు చేయడానికి మణిపాల్ ఎడ్యుకేషన్ అండ్ మెడికల్ గ్రూప్ రెండవ బిడ్‌ను సమర్పించింది. ఇది బైజూస్ రిజల్యూషన్ ప్రొఫెషనల్కి ఆసక్తి వ్యక్తీకరణను సమర్పించింది. రంజన్ పాయ్ యాజమాన్యంలోని మణిపాల్ గ్రూప్ బైజూస్‌ను కొనుగోలు చేయడానికి బిడ్ దాఖలు చేయడం ఇది రెండో సారి. బిడ్డర్లు లేకపోవడంతో, ఆర్‌పి కొత్త బిడ్‌లను ఆహ్వాని ంచింది. దీనికి చివరి రోజు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం.. బైజూస్‌ను కొనుగోలు చేయడానికి మణిపాల్ గ్రూప్ మాత్రమే బిడ్ సమర్పించింది.ఆకాష్ ఎడ్యుకేషన్ పై మణిపాల్ గ్రూప్ దృష్టిబైజూస్ అప్పుల భారం దృష్ట్యా, కోర్టు ఆదేశాల మేరకు ఒక పరిష్కారం కోసం వెతకడం జరిగింది. దీని ప్రకారం.. బైజూస్ ఆస్తులను విక్రయి ంచి అప్పు చెల్లించడానికి ఒక రిజల్యూషన్ ప్రొఫెష నల్‌ను ఎంపిక చేశారు. ఇప్పుడు ఆయనను బిడ్డింగ్‌కు ఆహ్వానించారు. మణిపాల్ గ్రూప్ బైజూస్ కంటే ఆకాష్ ఎడ్యుకేషన్ సర్వీసెస్ కంపెనీపై దృష్టి పెట్టింది. బైజూస్ 2021లో ఆకాష్ కంపెనీని కొనుగోలు చేసింది. కోచింగ్ రంగంలో ప్రసిద్ధి చెందిన ఆకాష్ కంపెనీని కొనుగోలు చేయడానికి మణిపాల్ గ్రూప్ ఆసక్తి చూపుతోంది. రంజన్ పాయ్ బైజూస్ రుణాలలో కొన్నింటిని చెల్లించాడు. ప్రతిగా ఆకాష్ కంపెనీ. 40 శాతం వాటా ఇవ్వబడింది.ఇప్పుడు బైజూస్‌ను కొనుగోలు చేయడం ద్వారా, మణిపాల్ గ్రూప్ ఆకాష్ ఎడ్యుకేషన్ సర్వీసెస్‌పై పూర్తి నియంత్రణను పొందుతుంది. దాని కొనుగోలుకు బిడ్డర్ కూడా అదే. అయితే ఈ కారణంగానే కొనుగోలు సాధ్యమవుతుందని ఎటువంటి హామీ లేదు. ప్రతిదీ విచక్షణా నిర్ణయంపై కూడా ఆధారపడి ఉండవచ్చు.

# కోల్‌కతా టెస్ట్ ఓటమి - గంభీర్‌పై మాజీ పేసర్ ఫైర్




వేద న్యూస్ డెస్క్:

కోల్‌కతాలో దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి టెస్టులో మూడోరోజు భారత జట్టు ఘోర పరాజాయాన్ని చవిచూసింది. తొలి రెండురోజుల్లో మ్యాచ్ భారత్‌కు అనుకూలంగా ఉండగా.. మూడోరోజు ఒక్కసారిగా మలుపు తిరిగి ఒక్కసారిగా జట్టు కుప్పకూలింది. 124 పరుగుల సాధారణ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో భారత్ కేవలం 93 ??పరుగులకే ఆలౌట్ అయ్యింది. ఈ ఓటమి తర్వాత, భారత మాజీ ఫాస్ట్ బౌలర్ వెంకటేష్ ప్రసాద్ టీమ్ మేనేజ్‌మెంట్, సెలక్షన్ కమిటీపై ప్రశ్నలు లేవనెత్తారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా పోస్ట్ పెట్టారు. ‘వైట్‌బాల్ క్రికెట్‌లో అద్భుతంగా ఉన్నాం. కానీ, ఈ రకమైన ప్రణాళికలో మనం అత్యుత్తమ టెస్ట్ జట్టుగా చెప్పుకోలేం. సెలక్షన్‌లో స్పష్టత లేకపోవడం, అతి వ్యూహాత్మక ఆలోచన జట్టును దెబ్బతీస్తోంది. గతేడాదిలో టెస్ట్ క్రికెట్‌లో ఫలితాలు నిరాశ పరిచాయి’ అంటూ వెంకటేశ్ ప్రసాద్ పేర్కొన్నారు. కోచ్ గౌతమ్ గంభీర్, చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్‌ను నేరుగా విమర్శలు గుప్పించారు. గంభీర్ కోచ్ అయ్యాక భారత టెస్ట్ రికార్డు చర్చనీయాంశంగా మారింది. నిర్దిష్ట ప్రణాళిక లేకుండా జట్టులో మార్పులు చేస్తున్నారని.. ఇది స్థిరత్వాన్ని ప్రభావితం చేస్తున్నట్లుగా ప్రసాద్ విమర్శించారు.తొలి టెస్టులో టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తొలి ఇన్నింగ్స్ సమయంలో గాయంతో రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగాడు. మెడ గాయంతో పెవిలియన్‌కు చేరుకున్నాడు. కేవలం మూడు బంతులు మాత్రమే ఆడాడు. గిల్‌ను ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నట్లుగా బీసీసీఐ వెల్లడించింది. జట్టు బ్యాటింగ్ ఇప్పటికే ఒత్తిడిలో ఉండగా.. జట్టు కెప్టెన్ లేకపోవడంతో మరింత ఇబ్బందికరంగా మారింది. ఈ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాలో స్పిన్నర్లు చెలరేగారు. సైమన్ హార్మన్ మ్యాచ్‌లో మొత్తం ఎనిమిది వికెట్లు పడగొట్టాడు. తొలి, రెండో సెషన్లలో నాలుగు చొప్పున వికెట్లు కూల్చాడు. కేశవ్ మహరాజ్ సైతం రెండో ఇన్నింగ్స్‌లో రెండు బంతుల్లో రెండు వికెట్లు తీశాడు. దాంతో భారత్ కష్టాల్లోపడింది. స్పిన్నర్లు భారత బ్యాట్స్‌మెన్ కుదురుకోకుండా ఇబ్బంది పెట్టారు. దాంతో దక్షిణాఫ్రికా సిరీస్‌లో 1–0 తేడాతో ఆధిక్యంలో నిలిచింది. దక్షిణాఫ్రికా రెండవ ఇన్నింగ్స్‌లో 91/7తో కష్టాల్లో ఉండగా.. కెప్టెన్ టెంబా బావుమా 55 పరుగులతో అజేయంగా నిలువడంతో జట్టు గౌరవప్రదమైన స్కోరు చేసింది. ఈ మ్యాచ్‌లో బావుమా ఇన్నింగ్స్ కీలకమైంది. బావుమాను భారత బ్యాట్స్‌మెన్‌లో కట్టడి చేసి ఉంటే ఫలితం మరోలా ఉండేది క్రికెట్ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

# జనవరి 7 నుంచి నాలుగో సీజన్..

వేద న్యూస్ డెస్క్:

మహిళల క్రికెట్‌ను కొత్త పుంతలు తొక్కించిన మహిళల ప్రీమియర్ లీగ్ మరో ఎడిషన్‌కు సిద్ధమవుతోంది. మూడు సీజన్లుగా అభిమానులను స్టేడియాలకు రప్పించిన ఈ మెగా టోర్నీ నాలుగో సీజన్ జనవరిలోనే ప్రారంభం కానుంది. ఐదు ఫ్రాంచైజీలు రీటెన్షన్ జాబితాను సమర్పిం చడంతో వేలానికి సన్నాహకాలు చేస్తున్న నిర్వాహకలు.. టోర్నీ తేదీలను కూడా ఖరారు చేసే పనిలో ఉన్నారు. క్రిక్ బజ్ కథనం ప్రకారం జనవరి 7 నుంచి ఫిబ్రవరి 3 వరకూ నాలుగో సీజన్ జరుగనుందని సమా చారం.వచ్చే ఏడాది భారత్, శ్రీలంక సంయుకంగా పురుషుల టీ20 వరల్డ్‌కప్ పోటీలకు ఆతిథ్యమిస్తున్నాయి. ఫిబ్రవరి మొదటి వారంలోనే ప్రపంచకప్ జరుగనున్న నేపథ్యంలో డబ్ల్యూపీఎల్ షెడ్యూల్‌ను ముందుకు జరిపారు నిర్వాహకులు. అందుకే.. ఫిబ్రవరిలో ప్రారంభం కావాల్సిన టోర్నీ ఈ సారి జనవరిలోనే షురూ కానుంది. అంతే కాదు మూడో సీజన్ మాదిరిగా కాకు ండా డబ్ల్యూ పీఎల్ నాలుగో సీజన్ మ్యాచ్‌లను రెండు నగరాల్లో నిర్వహించే అవకాశముంది.రెండు విడతలుగా సాగే ఈ మెగా ఈవెంట్‌కు ముంబై, బరోడాలను వేదికలుగా ఎంపిక చేసినట్టు విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. తొలిదశ మ్యాచ్‌లు




నవీ ముంబైలోని డీవై పాటిల్ స్టేడియంలో.. రెండో దశ మ్యాచ్‌లు బరోడాలోని కోటంబి మైదానంలో డబ్ల్యూపీఎల్ మ్యాచ్‌లు ఆడించనున్నారు.